ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 21 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 254 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: దశమి - 07:17:14 వరకు, ఏకాదశి - 30:33:15 వరకు నక్షత్రంపూర్వాభాద్ర - 06:57:05 వరకు కరణంగర - 07:17:14 వరకు, వణిజ - 19:01:53 వరకు పక్షంశుక్ల యోగంవజ్ర - 28:55:31 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

2027 చివరి త్రైమాసికంలో బుల్లెట్ రైలు

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 20(ప్రజాజ్యోతి): భారతదేశపు తొలి స్వదేశీ బుల్లెట్ రైలు కల సాకారం కావడానికి కీలక అడుగులు పడుతున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందుతున్న 'బీ28' బుల్లెట్ ట్రైన్ పట్టాలపైకి వచ్చే సమయం ఆసన్నమైంది. ఈ

మిగతా 2లో..

ఉగ్రవాదులకు ప్లాన్లు ఇస్తున్న ఏఐ..

అమెరికా పరిశోధనలో షాకింగ్ నిజాలు

ఏఐ భద్రతా చర్యలపై ఆందోళన

న్యూఢిల్లీ, నవంబర్ 20(ప్రజాజ్యోతి): మనం రోజూ ఎన్నో పనులకు ఉపయోగించే కృత్రిమ మేధ (ఏఐ) చాట్‌బాట్‌లు, ఇప్పుడు ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించి ఇచ్చేంత ప్రమాదకరంగా మారాయి. ఈ భయంకరమైన వాస్తవాన్ని అమెరికా ప్రభుత్వ జవాబుదారీ కార్యాలయం (జీఏవో) జరిపిన ఒక పరిశోధన వెలుగులోకి తెచ్చింది. ఈ పరిణామంపై

మిగతా 2లో..



తెలంగాణకు మెస్సీ వచ్చాడు..

- ఇప్పుడు రొనాల్డోను తీసుకొస్తాం
- తేదీలు ఇంకా ఖరారు కాలేదు
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన
- అంతర్జాతీయ క్రీడలు నిర్వహించడమే లక్ష్యం
- జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ సరికాదు
- దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయమే
- దక్షిణాది రాష్ట్రాల గొంతుక బలహీనపడే ఛాన్స్
- ఆర్థిక ప్రగతి, జీడీపీని కూడా పరిగణించాలి
- ప్రతి పేదవాడి అభ్యున్నతే నిజమైన అభివృద్ధి
- నెహ్రూ హయాంలో విద్య, సాగునీటికి ప్రాధాన్యత
- పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు అద్భుతం
- వాటిని మన్మోహన్ సింగ్ కొనసాగించిన తీరు భేష్
- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌తో ముందుకు
- దేశ ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ
- భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీతో ముందుకు
- రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- వచ్చేనెలలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య,
- తెలంగాణలో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ క్యాంపస్‌లు
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ రావణాసురుడు
- కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్.. పోటీనే కాదు
- 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్ వేదికగా ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'సదరన్ రైజింగ్ సమ్మిట్--2026'లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర విద్యారంగ అభివృద్ధికి తాము తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలను వివరించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో అందే నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోనూ అందించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఆయన తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో ఆసక్తికరమైన వార్త చెప్పారు. ఇప్పటికే అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని.. త్వరలోనే పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. మెస్సీ తన అభిమాన ఫుట్‌బాలర్ అని, గతంలో అర్జెంటీనా దిగ్గజం డిగో మారడోనా కూడా తన ఫేవరెట్ ఆటగాడని తెలిపారు. హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి .. క్రీడలు, రాజకీయాలు, దేశాభివృద్ధి, తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలను నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం

మిగతా 2లో..

ఉద్యమంలో చుక్కా రామయ్య సేవలు మరువలేను

విద్యా రంగానికి రామయ్య మార్గదర్శకంగా నిలిచారు

ప్రజా ప్రభుత్వం ఆయన సూచనలతో ముందుకు..

చుక్కా రామయ్య జన్మదిన వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి

101వ ఏట అడుగుపెట్టిన ఐఐటీ చుక్కా రామయ్య..

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, పద్మశ్రీ చుక్కా రామయ్యకు వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యావేత్తలు, మేధావులు, ఆయన శిష్యులు, రాజకీయ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చుక్కా రామయ్య నివాసానికి వచ్చి

మిగతా 2లో..

తేల్చుకుందాం రా..

- సిద్దిపేటలో నాపై పోటీ చేయ్..
- నన్ను తిట్టడానికే సిద్దిపేటలో సభ
- సొంత ఎమ్మెల్యేలే విమర్శిస్తున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్
- ఆంధ్రాకు నీళ్ళు ధారాదత్తం చేసిన ద్రోహి
- రేవంత్ రెడ్డికి అబద్దాల్లో ఆస్కార్ ఇవ్వొచ్చు



హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని.. 2029 ఎన్నికల్లో తెలంగాణతోపాటు అక్కడ కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి నిన్న సిద్దిపేట సభ సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలని.. అక్కడే ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. సిద్దిపేట సభలో రేవంత్ ప్రసంగం మొత్తం అబద్ధాలు, విమర్శలతోనే సాగిందని మండిపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేటలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి.. ఆ పథకం గురించి మాట్లాడకుండా తనతో పాటు కేసీఆర్, కేటీఆర్ పేర్లను పదేపదే ప్రస్తావించారని విమర్శించారు. సిద్దిపేట సభలో రేవంత్‌రెడ్డి ముఖంలో తీవ్ర నిరాశ, అసహనం కనిపించాయని అన్నారు. తమ పేర్లను సీఎం ఏకంగా 140 సార్లు తలచుకున్నారని వ్యాఖ్యానించారు. తనను తాటిచెట్టుతో

మిగతా 12లో..

తెలంగాణ కా బాద్షా కేసీఆర్

రేవంత్ రెడ్డి వన్ టైమ్ వండర్ లీడర్..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): హైదరాబాద్ వేదికగా ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న 'సదరన్ రైజింగ్ సమ్మిట్--2026' వేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన కేటీఆర్.. ఢిల్లీకి ట్రిప్పులు వేయడంలో, ఢిల్లీ పెద్దలకు బ్యాగులు మోయడంలో, తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రికి 10కి 10 మార్కులు ఇవ్వవచ్చని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కానీ, ఎల్‌నినో ప్రభావంపై కానీ ముఖ్యమంత్రికి ఏమాత్రం దిగులు లేదని, ప్రస్తుతం ఆయనకున్న ఒకే ఒక్క దిగులు 'నేను గడ్డం ఎందుకు పెంచుకున్నాను'

మిగతా 12లో..



త్వరలోనే 2 వేల హోంగార్డు పోస్టుల భర్తీ

రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కీలక ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు పోలీస్ శాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్ర పోలీస్ శాఖలో త్వరలోనే 2 వేల మంది హోంగార్డులను నియమించే అంశంపై కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు నియామక నోటిఫికేషన్, ఇతర వివరాలపై పోలీస్ ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించారు. డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం నిర్వహించిన మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశంలో హోంగార్డుల నియామకంతో పాటు పోలీస్ శాఖ బలోపేతం, సిబ్బంది సంక్షేమం, రాబోయే కార్యక్రమాలపై కీలక నిర్ణయాల దిశగా సమీక్ష చేపట్టారు. తెలంగాణ పోలీస్ శాఖలో సిబ్బంది అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు 2,000 మంది

మిగతా 2లో..


హైదరాబాద్ జోన్ పరిధిలో పదోన్నతులు

ఉద్యోగులకు టీజీఎస్ఆర్టీసీ తీపికబురు

63 మందికి ప్రమోషన్లు కల్పిస్తూ ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ జోన్ పరిధిలో ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మొత్తం 63 మంది ఉద్యోగులకు వివిధ ఉన్నత హోదాల్లో పదోన్నతులు కల్పిస్తూ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుశ్రో షా ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే 25-05-2025న నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ రాత పరీక్షతో పాటు, 27-07-2025న నిర్వహించిన కంప్యూటర్ స్కిల్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు తాజాగా

మిగతా 2లో..



భూముల రీసర్వేలో ఆరు దశల విధానం

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ – నాలుగు రోజుల ముందే నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): తెలంగాణలో భూముల రీ సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. క్షేత్ర స్థాయిలో సర్వే సిబ్బంది పాటించాల్సిన మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) లోకేశ్ కుమార్ జారీ చేశారు. అన్నీ గ్రామాల వారీగా భూ రీసర్వే నిర్వహణ, రికార్డులు సరిచూడటం, భూముల కొలతలు, తుది రికార్డుల ఖరారు, అభ్యంతరాల పరిష్కారం కోసం ఆరు దశల విధానాన్ని నిర్దేశించారు. ప్రధానంగా సర్వేకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం, సర్వే చేసిన విస్తీర్ణాన్ని వెంటనే రైతులకు తెలియజేయడం, తహసీల్దార్ స్థాయిలో పరిశీలన, వెరిఫికేషన్, గ్రామస్థాయి క్యాంపులు, వివాదాల పరిష్కారానికి ప్రయత్నం చేయడం లాంటివి అధికారులు తప్పకుండా పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భూమిని సర్వే చేయడానికి నాలుగు రోజుల ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని, సర్వేకు రెండు రోజుల ముందే పట్టాదారులకు సర్వేకు సంబంధించిన ఫ్లాగ్స్ అందించాలని, సర్వే పూర్తయిన వెంటనే కొలిచిన విస్తీర్ణాన్ని రైతులకు చెప్పాలని సూచించారు. పహాణీ విస్తీర్ణానికి, వాస్తవ కొలతలకు తేడాలుంటే వెంటనే పట్టాదారులకు సమాచారం ఇవ్వాలని రెవెన్యూ శాఖ తెలిపింది.సర్వేకు రికార్డుల్లో ఉన్న తేడాలకు కారణాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో స్పష్టంగా

మిగతా 12లో..

మా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం

తెలంగాణలో అసలైన ఆట మొదలైంది

కాంగ్రెస్, బీఆర్ఎస్ ల సంగతి చూస్తాం

లోకజ్ఞానం లేకుండా రాహుల్ మాటలు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): తెలంగాణ సీఎం ఏ రేవంత్ రెడ్డిపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సిద్దిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కిషన్ రెడ్డి.. తెలంగాణ రాజకీయాల్లో ఇకపై బీజేపీ అసలైన ఆట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు రాజకీయ మార్పును బలంగా కోరుకుంటున్నారని, దానిని నిజం చేసే సత్తా ఒక్క తమ పార్టీకి మాత్రమే ఉందని



మిగతా 12లో..

వీసా, మాస్టర్‌కార్డ్ కస్టమర్ల డేటా లీక్

కస్టమర్ల డేటాపై సైబర్ దాడులు

థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లతో లీక్

న్యూఢిల్లీ, నవంబర్ 20(ప్రజాజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక సేవల సంస్థలు వీసా, మాస్టర్‌కార్డ్, జేపీ మోర్గాన్ చేజ్‌కు సైబర్ దాడి సెగ తగిలింది. తమ కస్టమర్లకు సంబంధించిన కొంత సమాచారం బయటకు పొక్కినట్లు ఈ సంస్థలు ధ్రువీకరించాయి. అయితే, ఈ దాడి తమ సొంత సిస్టమ్స్‌పై జరగలేదని, తమకు సేవలు అందించే థర్డ్-పార్టీ సంస్థలే లక్ష్యంగా జరిగిందని స్పష్టం చేశాయి. ఈ ఘటనల వల్ల తమ కోర్ పేమెంట్ నెట్‌వర్క్‌లకు గానీ, చెల్లింపుల వ్యవస్థలకు గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని భరోసా ఇచ్చాయి.

మిగతా 2లో..



సంపాదకీయం

నగరానికి నీటి కష్టాలు తగ్గేనా!?

రాష్ట్రంలో ఎల్ నినో కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే వార్షాభావ పరిస్థితులవల్ల అన్ని రంగాలు కుదేలౌతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సరైన వర్షాలు లేక ఇప్పటికే వర్షాధారిత పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పంటలకు సరిపడా నీరు లేక పంటలు ఎండిపోయి రైతన్నలు నష్టాల బాట పట్టారు. మరో వైపు తాగునీరు కూడా తగినంతగా లేకపోవడంతో రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా సింగూరు- మంజీరా జలాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి అదనపు జలాలను తరలించేందుకు జలమండలి చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఎంబీఆర్)కు గోదావరి జలాలను తరలించేందుకు చేపడుతున్న 1600 మి.మీ. వ్యాసం గల మిషన్ భగీరథ-జలమండలి పైప్‌లైన్ అనుసంధాన పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డితో కలిసి శుక్రవారం పైప్‌లైన్ అనుసంధాన పనులను పరిశీలించారు. పనుల పురోగతి, సాంకేతిక అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, ట్రయల్ రన్‌కు సిద్ధం కావాలని ఆదేశించారు. వాస్తవానికి ఈ నెల 15 నాటికే పైప్‌లైన్ నిర్మాణం, అనుసంధాన పనులను పూర్తి చేయాలని తొలుత లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, అటవీ ప్రాంతం గుండా వెళ్లే 150 మీటర్ల పైపులైన్ మార్గంలో భారీ రాతి పొరలను తొలగించాల్సి రావడంతో పనుల్లో జాప్యం ఏర్పడింది. దీంతో నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి కాలేకపోయాయి. ప్రస్తుతం మిగిలిన పనులను వేగవంతంగా కొనసాగిస్తున్నామని, రెండు రోజుల్లో అన్ని విధాలుగా పూర్తి చేసి, అనంతరం ట్రయల్ రన్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.మరోవైపు ఘన్‌పూర్ ఎంబీఆర్ ప్రాంగణంలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టిన పైప్‌లైన్ జంక్షన్ పనులు ఇప్పటికే అన్ని విధాలుగా పూర్తయ్యాయి. ఈ జంక్షన్ వినియోగానికి సిద్ధంగా ఉంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తయిన వెంటనే ట్రయల్ రన్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగూరు- మంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా నగర తాగునీటి సరఫరాకు జలమండలి ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోజుకు 40 ఎంజీడీల అదనపు గోదావరి జలాలను నగరానికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా సింగూరు- మంజీరా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు నీటి సరఫరాలో ఏర్పడే లోటును సుమారు 50 శాతాన్ని గోదావరి అదనపు జలాలను తరలించి భర్తీ చేయనున్నారు. పైప్‌లైన్ పనులను వేగవంతం చేయడంతోపాటు మిషన్ భగీరథ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. మిగిలిన సాంకేతిక పనులను పూర్తి చేసి, ట్రయల్ రన్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మరోవైపు పశు సంపాదకు త్రాగు నీరు లేక సంతకు పశువుల రాక ఒక్కసారిగా పెరిగింది. కొనుగోళ్ల కోసం వచ్చే వ్యాపారుల కంటే తమ పశువులను విక్రయించేందుకు వస్తున్న రైతులే ఎక్కువగా కనిపిస్తున్నారు. మేతకు డబ్బుల్లేక, నీటిని అందించలేక అన్నదాతలు తమకు ఎంతోకాలంగా అండగా ఉన్న మూగజీవాలను వదులుకుంటున్నారు. ఒకప్పుడు లక్ష రూపాయలకు పైగా ధర పలికే కోడెల జతను ఇప్పుడు రూ.50 వేలకే అమ్ముకోవాల్సి వస్తోంది. పశువులను అమ్ముకోవడం ఇష్టం లేకపోయినా.. పోషించలేని పరిస్థితి రైతులను ఈ నిర్ణయం తీసుకునేలా చేస్తోంది. వ్యవసాయంలో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు పశుపోషణ మరో ఆదాయ వనరుగా ఉండేది. పాలు, పశువుల సంతానం ద్వారా కొంత ఆదాయం సమకూరడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన సేంద్రియ ఎరువు కూడా లభించేది. కానీ వాతావరణ పరిస్థితులు ఈ సమీకరణాన్ని మార్చేశాయి. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు పంటల సాగును దెబ్బతీయడంతో పాటు పశువుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వరి సాగు తగ్గడంతో పశువులకు ప్రధాన ఆహారమైన వరిగడ్డి కొరత ఏర్పడింది. పొలాల్లో పచ్చిక లేకపోవడం, చెరువులు, వాగులు ఎండిపోవడంతో మేత, నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ వారాంతపు సంత ఈ సంక్షోభానికి ప్రత్యక్ష ఉదాహరణగా మారింది. ప్రతి మంగళవారం జరిగే ఈ సంతకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా రైతులు, వ్యాపారులు వస్తుంటారు. సాధారణంగా ఇక్కడికి సుమారు 2 వేల పశువులు రాగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 5 వేలకు చేరింది. నారాయణఖేడ్, మానూర్, నాగలిగిద్ద, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట్, పెద్ద శంకరంపేట్ మండలాల నుంచి రైతులు పశువులను విక్రయానికి తీసుకొస్తున్నారు. ఎద్దులు, గేదెలతోపాటు గొర్రెలు, మేకల అమ్మకాలు కూడా పెరిగాయి. పశువులను అమ్మేందుకు రైతులు తొందరపడుతుండటంతో కొనుగోలుదారులు తమకు అనుకూలమైన ధరలకే బేరాలు సాగిస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. లక్ష రూపాయలకు పైగా విలువ చేసే కోడెల జతను సైతం రూ.50 వేలకే విక్రయించాల్సి వస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చే వ్యాపారులు తక్కువ ధరలకు పశువులను కొనుగోలు చేస్తున్నారు. మేత కొనుగోలు చేసే స్థోమత లేక, ఉన్న పశువులను పోషించలేక రైతులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులను సంతకు తీసుకొచ్చే రైతుల వెనుక ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. వ్యవసాయ పనుల్లో తమతో పాటు శ్రమించిన ఎద్దులను అమ్ముకోవాల్సి రావడం వారిని మానసికంగా కుంగదీస్తోంది. ఇంకా పదేళ్లపాటు పనిచేయగల సామర్థ్యం ఉన్న కాడెద్దులను కూడా విక్రయిస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ కళ్ల ముందే చనిపోవడం చూడలేక.. వచ్చిన ధరకు అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులను కొనుగోలు చేసేవారు ముందుకు రాకపోయినా, వాటిని ఇంటికి తీసుకెళ్లి పోషించే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరిగా అమ్మకానికి పెడుతున్నారు. పశువుల విక్రయాలు ఇలాగే కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద బాగా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు తగ్గితే వ్యవసాయానికి అవసరమైన సేంద్రియ ఎరువుల లభ్యతపైనా ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో కరవు ప్రభావిత ప్రాంతాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు సబ్సిడీపై ఎండుగడ్డి అందించాలని కోరుతున్నారు. పశువుల తాగునీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు పశుపోషకులకు ఆర్థికంగా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. పంటలను కాపాడటంతోపాటు పశుసంపదను సంరక్షించేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. ఒకవేళ అన్ని సక్రమంగా జరిగితే నగరానికి నీటి కష్టాలు కాస్త తగ్గుతాయనే చెప్పుకోవచ్చు. కానీ ఇదే ప్రభావం కొనసాగితే మరిన్ని తాగునీటి కష్టాలు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



తెలంగాణకు మెస్సీ వచ్చాడు..

మొదటిపేజీ తరువాయి..

రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని రాష్ట్రానికి తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పుడు క్రిస్టియానో రొనాల్డోను కూడా తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. రొనాల్డో పర్యటనకు సంబంధించి ఇంకా తేదీలు ఖరారు కాలేదు. ఆయన ఆహ్వానాన్ని అంగీకరించారా, ఎప్పుడు వస్తారు, ఎలాంటి కార్యక్రమంలో పాల్గొంటారనే వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచడం సరికాదని అభిప్రాయపడ్డారు. అలా చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాతో పాటు రాష్ట్రాల ఆర్థిక ప్రగతి, జీడీపీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 50 శాతం సీట్ల పెంపును కేవలం జనాభా ఆధారంగా చేపడితే ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాల గొంతుక బలహీనపడే అవకాశం ఉందని పేర్కొన్నారు.దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాలను సీఎం రేవంత్ ప్రస్తావించారు. ప్రతి పేదవాడి అభ్యున్నతే నిజమైన అభివృద్ధి అని మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వసించారని గుర్తుచేశారు. నెహ్రూ హయాంలో విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి అనేక విద్యాసంస్థలు, నీటిపారుదల ప్రాజెక్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, వాటిని మన్మోహన్ సింగ్ కొనసాగించిన తీరును ప్రస్తావించారు. పేదల సంక్షేమం, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ అభివృద్ధి నమూనా అని చెప్పారు. తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను రూపొందించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గడిచిన మూడేళ్లలో 65 శాతం కార్యక్రమాలను అమలు చేశామని, మిగిలిన వాటిని వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడించారు. పెట్టుబడులకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటైన విద్య అందించడమే లక్ష్యంగా సంస్కరణలు చేపట్టినట్లు రేవంత్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని తెలిపారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలు దూరంగా ఉండటంతో చదువుకు దూరమవుతున్న విద్యార్థుల సమస్యను పరిష్కరించేందుకు ఇంటర్మీడియట్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయబోతున్నాయని తెలిపారు. తెలంగాణలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహిస్తున్నామని, ఇందులో సుమారు 8 వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. అంతర్జాతీయ క్రీడాకారులను రాష్ట్రానికి ఆహ్వానించడం ద్వారా యువతకు ప్రపంచస్థాయి ఆటగాళ్లను దగ్గరగా చూసే అవకాశం కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

2027 చివరి త్రైమాసికంలో బుల్లెట్ రైలు

మొదటిపేజీ తరువాయి..

బుల్లెట్ ట్రైన్ ట్రాక్ ట్రయల్స్ 2027 మధ్య నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని, 2027 చివరి త్రైమాసికంలో తొలి కమర్షియల్ సర్వీసు మొదలవుతుందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ముందుగా సూరత్- వాపి విభాగంలో తొలి సర్వీసును ప్రారంభిస్తామని, ఆ తర్వాత దశలవారీగా ముంబయి వరకు పూర్తి కారిడార్‌ను అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. ఇటీవల తన సబ్‌స్టాక్ బ్లాగ్ పోస్ట్‌లో మంత్రి అశ్విని వైష్ణవ్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పురోగతిని వివరించారు. భారతదేశ తొలి బుల్లెట్ రైలు ఇప్పుడు కేవలం ఒక ప్రకటన మాత్రమే కానే కాదని, 508 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు పూర్తి వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.భారత్‌లో తయారవుతున్న ఈ తొలి బుల్లెట్ ట్రైన్‌కు దీ28 అని పేరు పెట్టారు. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ స్వదేశీ రైలును తయారు చేస్తున్నాయి. బెంగళూరులోని బీఈఎంఎల్ తయారీ కేంద్రంలోనే రైలు నిర్మాణం జరుగుతోంది. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా దీనిని రూపొందిస్తున్నారు. రైలుకు సంబంధించిన మొదటి బాడీ ఫ్రేమ్ నిర్మాణం పూర్తయిందని, ప్రస్తుతం దానికి స్ట్రక్చరల్ టెస్టింగ్ జరుగుతోందని అశ్విని వైష్ణవ్ తన సబ్‌స్టాక్ పోస్టులో తెలిపారు. 2027 మధ్యలోనే ట్రాక్ ట్రయల్స్ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దీ28 తర్వాత గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల దీ35 రైలును అభివృద్ధి చేయడం తదుపరి లక్ష్యమని వెల్లడించారు. ఈ స్వదేశీ బుల్లెట్ ట్రైన్ మొత్తం పొడవు సుమారు 202 మీటర్లు ఉంటుంది. దీంట్లో 8 కోచ్‌లు ఉంటాయి. నాలుగు మోటార్ కార్లు, నాలుగు ట్రైలర్ కార్లతో రైలు నిర్మాణం ఉంటుంది. ఒకేసారి సుమారు 557 మంది ప్రయాణించవచ్చు. దీంట్లో 3ఇ2 సీటింగ్ అరెంజ్‌మెంట్స్‌తో 7 స్టాండర్డ్ క్లాస్ కోచ్‌లు, 2ఇ2 సీటింగ్‌తో ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్ ఉంటాయి. రైలుకు రెండు వైపులా డ్రైవర్ క్యాబిన్స్, ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమయ్యే ఇంటెలిజెంట్ ఆన్‌బోర్డ్ కంట్రోల్ సిస్టమ్‌ను కలిగి ఉంటాయి. అవసరాన్ని బట్టి రెండు 8 కోచ్‌ల రైళ్లను కలిపి 16 కోచ్‌ల రైలుగా కూడా నడపొచ్చు.

భారతీయ ప్రయాణికుల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని రైలు లోపలి భాగాల్ని రూపొందిస్తున్నారు. సౌకర్యవంతమైన సీట్లు, కాళ్లు చాపుకోవడానికి తగినంత స్థలం ఉండేలా, ఇంకా ఎల్ఈడీ లైటింగ్, పైన, కిందా లగేజీ ర్యాక్స్, ల్యాప్‌టాప్, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, అత్యాధునిక బయో డైజెస్టర్ టాయిలెట్స్, బయట ప్రకృతి దృశ్యాలను స్పష్టంగా చూసేందుకు వెడల్పుగా ఉండే కిటికీలు, ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి సులభంగా వెళ్లడానికి సీల్డ్ గ్యాంగ్‌వే వంటి సదుపాయాలను ఇందులో ఏర్పాటు చేస్తున్నారు.

ఉగ్రవాదులకు ప్లాన్లు ఇస్తున్న ఏఐ..

మొదటిపేజీ తరువాయి..

అమెరికా నిఘా వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యూహ్యాంప్‌షైర్ సెనేటర్ మేగీ హసన్ అభ్యర్థన మేరకు ఈ ఏడాది మే నెలలో జీఏవో అధికారులు.. చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినాయ్, గ్రోక్ వంటి ప్రముఖ ఏఐ చాట్‌బాట్‌లను పరీక్షించారు. ఉగ్రదాడికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరగా, మొదట అవి నిరాకరించాయి. అయితే, పరిశోధకులు తెలివైన ప్రశ్నలతో వాటి భద్రతా వలయాలను ఛేదించి సమాచారాన్ని రాబట్టగలిగారు. ఈ పరీక్షల్లో ఒక చాట్‌బాట్.. పార్కింగ్ ప్రాంతంలో ఎక్కడ కారు బాంబు పెడితే ఎక్కువ నష్టం జరుగుతుందో, ఎక్కువ మంది చనిపోతారో వివరిస్తూ ఏకంగా ఒక చిత్రాన్నే గీసి ఇచ్చింది. మరో చాట్‌బాట్ అయితే, డ్రోన్‌తో విద్యుత్ సబ్‌స్టేషన్‌పై ఎలా దాడి చేయాలో దశలవారీగా వివరించింది. హింస, నేరపూరిత సమాచారం ఇవ్వకుండా ఏఐ కంపెనీలు భద్రతా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, వాటిని అధిగమించే అవకాశం ఉందని ఈ పరిశోధన నిరూపించింది. ఇంతటి ప్రమాదకరమైన టెక్నాలజీ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఏఐ కంపెనీలు తీసుకుంటున్న భద్రతా చర్యలపై జీఏవో తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు, తమ చాట్‌బాట్‌లు ప్రమాదకరమైన సమాచారాన్ని అందించే అవకాశం ఉందని వాటిని రూపొందించిన కంపెనీలు అంగీకరించాయి. అయితే, జీఏవో పరిశోధన పద్ధతులను మాత్రం సవాలు చేశాయి. ఏదేమైనా, ఏఐ సాంకేతికత భద్రత విషయంలో మరింత కఠినమైన నిబంధనలు అవసరమనే వాదనకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

ఉద్యమంలో చుక్కా రామయ్య సేవలు మరువలేను

మొదటిపేజీ తరువాయి..

జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. చుక్కా రామయ్య తనదైన శైలి విద్యా బోధనతో యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని సీఎం కొనయాడారు. ఐఐటీ రామయ్య విద్యా రంగానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందంగా గడపాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం ఆయన సూచనలతో ముందుకు వెళుతుందని తెలిపారు. ఒక గొప్ప పర్వదినం. స్వాతంత్ర్య పోరాట సమయంలో, తెలంగాణ ఉద్యమంలో పేదలకు విద్యను అందించారు. ఐఐటీ అనే పదాన్ని ఈ రాష్ట్ర ప్రజలకు, విద్యార్థులకు పరిచయం చేసిన ఒక విద్యావేత్తగా సామాజిక పరివర్తన తీసుకొచ్చారు. వారు వందేళ్లు పూర్తి చేసుకోవడం తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ గొప్పగా, గర్వంగా భావించాల్సిన రోజు. విద్యలోనే కాకుండా ఆనాటి స్వాతంత్ర్య పోరాటం ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం పాల్గొనడమే కాకుండా, విద్యావేత్తగా, శాసనమండలిలో సభ్యులుగా తనదైన ముద్రను మన ప్రాంతం మీద వేశారని అన్నారు. చదువుల తల్లి చల్లని ఒడిలో ఎదిగే వారికి ఎల్లలు లేవని నిరూపించిన విద్యావేత్త చుక్కా రామయ్య వందో జన్మదినం సందర్భంగా పలువురు ముఖ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 'మన చుక్కా రామయ్య వందేళ్ల పండుగ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని సావనీరుగా కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ఉపాధ్యాయుడికి చేరాలని ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు ఆకాంక్షించారు. చుక్కా రామయ్య చేసిన కృషి, సమాజంపై ఎంతో ఉందన్నారు. ఆయన వద్ద శిక్షణ తీసుకొని ఐఐటీ విద్యను అభ్యసించిన విద్యార్థులు 1500 మంది ఉన్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ దీకే అరుణ, ఎమ్మెల్సీ కోదండరాం, హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



హైదరాబాద్ జోన్ పరిధిలో పదోన్నతులు

మొదటిపేజీ తరువాయి..

పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్) విభాగంలో మొత్తం 28 మంది పదోన్నతులు పొందగా వారిలో 23 మంది కండక్టర్లు, 3 మంది డ్రైవర్లు, 2 మంది ఆఫీసర్లు ఉన్నారు. ఇక జూనియర్ అసిస్టెంట్ (పర్సనల్) విభాగంలో 27 మంది పదోన్నతి పొందగా వారిలో 27 మంది కండక్టర్లు ఉన్నారు. ఇక డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) విభాగంలో 8 మంది పదోన్నతి పొందగా వారిలో డిపో కంట్రోలర్లు , ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు , ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నుంచి మొత్తం 8 మందికి డిప్యూటీ సూపరింటెండెంట్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన ఉద్యోగులకు టీజీఎస్ ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ అభినందనలు తెలియజేస్తూ, వారు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి సంస్థ ప్రతిష్టను పెంపొందించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే టీజీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుశ్రో షా ఖాన్ మాట్లాడుతూ, పదోన్నతులు పొందిన ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల ప్రతిభ, అర్హతలకు తగిన గుర్తింపునిస్తూ పదోన్నతులు కల్పించడం ద్వారా సిబ్బందిలో మరింత ఉత్సాహం, పని పట్ల నిబద్ధత పెరుగుతాయని పేర్కొన్నారు.

మలేషియాకూ వీసా కావాల్సిందే!

న్యూఢిల్లీ, నవంబర్ 20(ప్రజాజ్యోతి): వీసా కష్టాలు లేకుండా విదేశీ విహారయాత్రకు వెళ్లాలనుకునే భారత పర్యాటకులకు మలేషియా ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. 2027 జనవరి 1 నుంచి భారత పాస్‌పోర్ట్ కలిగిన వారికి 'వీసా-ఫ్రీ ఎంట్రీ' (వీసా లేకుండా ప్రవేశించే సదుపాయం) పూర్తిగా రద్దు చేస్తున్నట్లు మలేషియా ఇమ్మిగ్రేషన్ విభాగం నవంబర్ 17న అధికారిక నోటీసు జారీ చేసింది. 2023 డిసెంబర్ నుంచి అమల్లో ఉన్న 30 రోజుల వీసా మినహాయింపు ఈ ఏడాది డిసెంబర్ 31తో ముగియనుంది. టూరిస్ట్ వీసా ముసుగులో కొందరు అక్రమంగా ఉద్యోగాలు చేస్తున్నారనే ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2027 జనవరి 1 లేదా ఆ తర్వాత మలేషియాలో అడుగుపెట్టే ప్రతి భారతీయుడు ముందస్తుగానే చెల్లుబాటు అయ్యే వీసా కలిగి ఉండాలి. ముందుగానే విమాన టికెట్లు బుక్ చేసుకున్నప్పటికీ, ప్రయాణ తేదీ జనవరి 1 దాటితే వీసా తప్పనిసరి. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు డిసెంబర్ 1, 2026 నుంచి మలేషియా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ-వీసా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అయితే కొత్త నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకున్న ఏడు పని దినాలలోపు ఫీజు చెల్లించకపోతే ఆ దరఖాస్తు ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. ఒకసారి చెల్లించిన ప్రాసెసింగ్ ఫీజును వీసా తిరస్కరించినా, ప్రయాణం రద్దు చేసుకున్నా ఎట్టిపరిస్థితుల్లోనూ వాపసు ఇవ్వరు. దీనికి తోడు విదేశీ పర్యాటకులు తమ పర్యటన కాలానికి సరిపడా ట్రావెల్ మెడికల్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని మలేషియా సూచించింది.

వీసా, మాస్టర్‌కార్డ్ కస్టమర్ల డేటా లీక్

మొదటిపేజీ తరువాయి..

'అ0అ' అనే రాన్సమ్‌వేర్, దోపిడీ ముఠా ఈ సైబర్ దాడులకు బాధ్యత వహించింది. డబ్బులు చెల్లించేందుకు తాము విధించిన గడువు ముగియడంతో నిన్న కస్టమర్ల డేటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు ఈ గ్రూప్ ప్రకటించింది. లీకైన డేటాలో కస్టమర్ల కార్డు నంబర్లు, లావాదేవీల వివరాలు వంటి అత్యంత కీలకమైన సమాచారం లేదని, కేవలం ఈమెయిల్ చిరునామాలు, పేర్లు, మార్కెటింగ్ లేదా లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన రికార్డులు మాత్రమే ఉన్నాయని తెలిసింది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోని తమ థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్‌పై ఈ దాడి జరిగిందని వీసా పేర్కొంది. ప్రీమియం డైనింగ్, లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన వేలాది మంది కార్డుదారుల వివరాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. తమ పేమెంట్ సిస్టమ్స్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, కార్డు వివరాలు సురక్షితంగా ఉన్నాయని వీసా తెలిపింది. అదేవిధంగా ఒక నిర్దిష్ట బెనిఫిట్ ప్రోగ్రామ్‌లో ఉన్న కొద్దిమంది కస్టమర్ల ఈమెయిల్ వివరాలు మాత్రమే లీక్ అయ్యాయని, పేమెంట్ నెట్‌వర్క్‌పై దీని ప్రభావం లేదని మాస్టర్‌కార్డ్ వివరించింది. తమ బయటి వెండర్లపై దాడి జరిగిందని, కస్టమర్ల పేర్లు, ఈమెయిల్స్ వంటి మార్కెటింగ్ డేటా హ్యాకర్ల చేతికి చ

శిశు మందిర్‌లో అదనపు తరగతి గదులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబర్ 20(ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలోని స్థానిక శిశు మందిర్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన



విద్యా వసతులు కల్పించడం ఎంతో ముఖ్యమని, విద్యారంగ అభివృద్ధికి అవసర మైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈ అదనపు తరగతి గదులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పథకాలపై సంబరాలు..

చెప్రాల లో సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం

అదిలాబాద్ టౌన్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ భీమా పథకంతో పాటు ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పెన్షన్లు అందించే పథకాల పట్ల చప్రాల గ్రామ ప్రజలు హర్షం



వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా బేల మండలం చప్రాల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు అర్హులైన ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పథకాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెస్రం దౌలత్, ఉపసర్పంచ్ టాక్రె సాగర్,వార్డు సభ్యులు, మార్కెట్ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీప్రిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

అదిలాబాద్ టౌన్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమాన్ని శుక్రవారం ఇంద్రవెల్లి మండలం పీప్రి గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాలకు పథకంపై అవగాహన కల్పించి, అవసర



మైన వివరాలను సేకరించారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినా, మరణించినా ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ కోరెంగా సుంగు, పంచాయతీ కార్యదర్శి నందేవ్, సీసీ గెడం భాలజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



అంతా నా ఇష్టం..

ఆదిలాబాద్ లో పేలిన టపా సుల అక్రమాలు
అదిలాబాద్ లో విచ్చలవిడి గా అక్రమంగా టపాసుల వి క్రయాలు
అనుమతులు టపాసుల షాపు నిర్వహించేది గోడౌన్ లో దందా
అక్రమ గోడౌన్ లో పెద్ద ఎత్తు న టపాసుల నిల్వలు
భయభ్రాంతులకు గరవుతు న్న గ్రామస్తులు
అధికారుల ఆదేశాలు బేఖా తరు
మూసివేయాలని అధికారు లు ఆదేశించినా పట్టించు కో ని వ్యాపారి
బినామీ లైసెన్సుల తో మరో 10 షాపులు

ఆదిలాబాద్ లో ఓ టపాసు ల వ్యాపారి అంతా నా యి ష్టం అనే రీతిలో వ్యవహరి స్తున్నాడు. ఎవరైనా కొత్తగా ధుభాణం తెరవాలి అంటే ముందుగా ఆ వ్యాపారి అ నుమతి తీసుకోవాలి. లేదు కాదు అంటే అంతే సంగతి. ఆ ధుభానం నడవడానికి అ డ్డంకులు వస్తునే ఉంటాయి. అంతేకాదు నీవు లైసెన్సు తీ సుకోలేదా నా దగ్గరికి రా రూ 15 నుంచి 30 వేలు ఇ వ్వు. ఇదిగో నీకు ప్రభుత్వం జారీ చేసిన లైసెన్సు. అంతే కాదు టపాసులు కూడా నా వద్దే తీసుకోవాలి, వేరేచోట తీసుకుంటే నీ లైసెన్సు వెం టనే రద్దు అవుతుంది. అం తే కాదు అధికారులు దాడు లు కూడా చేయవచ్చు. దా నికి ఆశ్చర్యపోవాల్సిన అవ సరం లేదు.



ఆదిలాబాద్ బ్యూరో,
నవంబర్ 20,(ప్రజా జ్యోతి):
ఆదిలాబాద్ జిల్లాలో ఎలాం టి అనుమతులు లేకుండా అనేక మంది వ్యాపారులు విచ్చలవి డిగా టపాసులను విక్రయిస్తున్నారు. ఎక్కడ ప డితే అక్కడ దుఖానాలు తె రుస్తూ టపాసులు విక్రయి స్తూ లక్షలాది రూపాయల ను సొమ్ము చేసుకుంటున్నా రు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అధికారుల ఆదేశాలను కూడా ఖాతరు చేయకుండా విచ్చలవిడిగా నిభందన



లకు విరుద్ధం గా ట పాసులు విక్రయిస్తున్నారు. మారుమూల గ్రామీణ ప్రాం తాలతో పాటుగా మండల కేంద్రాలలో కూడా విచ్చల వి డిగా జనసంచారం అధికం గా ఉండే ప్రాంతాలలో ఈ టపాసులు విక్రయిస్తున్నా రు. ఈ టపాసులు విక్రయిం చడానికి ముందుగా స్థానిక గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసు కోవా ల్సి ఉంటుంది. ఆ తర్వాత స్థానిక తహసీల్దార్, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక అధికా రి అనుమతుల తీసు కోవా ల్సి ఉంటుంది. దీనికి ముం దుగా తాత్కాలిక లైసెన్స్ కో సం ముందుగా గ్రామం బ యట స్థలం, జనసంచారం లేని ప్రాంతంలో ఒకే చోట దుకాణాలు ఏర్పాటు చే సు కోవడం కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలి. ఆ స్థలం యజమానితో ఒప్పంద ప త్రంతోపాటు స్థానిక తహసి ల్దార్ దానిని నిర్ధారణ చేసి అనుమతి ఇవ్వాల్సి ఉం టుంది. ఆ తర్వాతనే మిగి తా తహసిల్దార్, గ్రామ పం చాయతీ కార్యదర్శి, అగ్ని మాపక అధికారి ద్వారా నో అబ్జెక్షన్ పత్రాలు జారీ చే యాల్సి ఉంటుంది. అంతే కాదు టపాసులు విక్రయించే సమయంలో ఫైర్ సేఫ్టీ నిబం ధనలు పాటిస్తూ అగ్నిమాప క రక్షణ పరికరాలు ఏర్పా టు చేయాల్సి ఉంటుంది. రె గ్యులర్ గా టపాసులు విక్ర యించేవారు జిల్లా కలెక్టర్ తో పాటు ఆర్డీవో జిల్లా అగ్ని మాపక అధికారి అనుమతు లు కూడా తీసుకోవాల్సి ఉం టుంది. టపాసుల దుకాణా లు జనసంచారం లేని ప్రాం తాల్లో తెరవాలి. ఊరు బ యట ఒక కిలోమీటర్ దూ రంలో ఈ టపాసుల దుకా ణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. టపాసులు నిల్వ చేసుకో వడానికి ప్రత్యేక గో దాములు కూడా గ్రామము బయట ఒక కిలోమీటర్ దూ రంలో నిర్మించు కోవాల్సి ఉం టుంది. దుకాణాల కొరకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్ప నిసరిగా పాటించాల్సి ఉం టుంది. ఇవేమీ పట్టనట్లుగా విచ్చలవిడిగా ఎలాంటి అ నుమతులు లేకుండా అక్ర మంగా వ్యాపారులు దుకా ణాలను తెరుస్తూ టపాసు లను బహిరంగంగా విక్రయి స్తున్నారు. జన సంచార ప్రాంతాలలో దుకాణాలు తెరుస్తూ గోదాములు ఏ ర్పాటు చేసుకుంటూ టపా సులను విక్రయిస్తున్నారు.

బినామీ లైసెన్సులతో వ్యపా రం:

అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారి అధికారుల నుం డి బినామీ పేరుల తో లైసె న్సులు పొంది అక్రమంగా ఈ టపాసుల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టపాసుల వ్యాపారానికి ఒకే ఒక వ్యక్తి ప్రతి సంవత్సరం చక్రం తిప్పుతున్నట్టు తెలు స్తోంది. అధికారులందరి క ట్టుకొని తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కా యలుగా సాగిస్తున్నట్లు స మాచారం. పౌస్ గూడ గ్రా మానికి చెందిన అరుణ్ రెడ్డి అనే టపాసుల వ్యాపారి అందరినీ తన గ్రిప్ లో ఉం చుకొని వ్యాపారాన్ని కొన సాగిస్తున్నట్లు తెలుస్తోంది. లైసెన్సులు పొంది వ్యాపా రం చేయని వారి లైసెన్సు లను తన వద్ద ఉంచుకుని బినామీలతో ఆ వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది.
ఒకే వ్యాపారి దాదాపు పది దుకాణాల వరకు తెరిచి ప్ర తి సంవత్సరం వ్యాపారం చే స్తున్నట్లు సమాచారం. బోర జ్ మండలం పౌస్ పూర్ గ్రామం వద్ద తన వ్యవ సా య క్షేత్రంలో వ్యవసాయ సామాగ్రిలు, యూరియా, ఇతర ఎరువులు నిల్వ చేసు కోవడానికి నిర్మించిన గోడౌన్ లో అక్రమంగా టపాసులు సైతం పెద్ద ఎత్తున నిలువ చేసుకొని ప్రతి సంవత్సరం దీపావళి ప్రారంభ మైందంటే తన వ్యాపారాన్ని పెద్ద ఎత్తు న ఇక్కడి నుంచే సాగిస్తు న్నారని గ్రామస్తులు తెలిపా రు. గ్రామంలో ఈ గోడ ఉం డడం వల్ల పెద్ద ప్రమాదం సంభవించవచ్చని గ్రామస్తు లు తీవ్ర భయాందోళనకు గు రవుతున్నారు. జిల్లా అగ్ని మాపక అధికారి సురేష్ కు ఫిర్యాదు చేశారు. ఆ ఈ ఫి ర్యాదు మేరకు జిల్లా అగ్ని మాపక అధికారి ఆ గోడౌన్ తీసివేయాలని ఆ వ్యాపారి కి ఆదేశాలు జారీ చేశారు. అయినప్ప టికీ ఆ వ్యాపారి అవేమీ పట్టనట్లుగా అదే గో దాములో పెద్ద ఎత్తున ట పాసులను నిల్వ చేసి వ్యా పారం కొనసాగిస్తున్నారు. ట పాసుల వ్యాపారంలో ఆరి తేరిన ఎల్ టి అరుణ్ రెడ్డి తనదైన రీతిలో టపాసుల వ్యాపారంలో చక్రం తిప్పు తున్నారు. ఎవరైనా కొత్తగా దుకాణం ఏర్పాటు చేయాల ని నిశ్చయించుకొని అరుణ్ రెడ్డిని సంప్రదించినట్లయితే అధికారుల ప్రమేయం ఏ మాత్రం లేకుండానే ఆయన వద్ద ఉన్న బినామి లైసెన్సు లు ఇచ్చి ఆ వ్యాపారాన్ని ప్రారంభింపజేస్తారు. దీనికి ముందు ఆ టపాసులు తన వద్ద కొనుగోలు చేయాలని లేనట్లయితే లైసెన్సులు లా క్కుంటానని హుకుం జారీ చే స్తారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ అరుణ్ రెడ్డి దాదాపు 10 బినామీ లైసె న్సులతో దుకాణాలు నడు పుతున్నట్లు సమాచారం.

అనుమతులు లేని టపాసులు ఎక్కువ:

ప్రభుత్వ నుంచి అనుమతి లేని టపాసులను ఎక్కువ గా విక్రయిస్తున్నట్లు తెలు స్తోంది. అక్రమంగా తయారు చేసిన, అనుమతి లేని షా పుల నుంచి దిగుబడి చేసు కొని పెద్ద ఎత్తున ఈ టపా సుల వ్యాపారం కొనసాగి స్తున్నట్లు తెలుస్తోంది. అను మతి ఉన్న కొన్ని టపాసుల ను కొనుగోలు చేసి అందు లో అనుమతి లేని టపాసు లను మిలితం చేసి ఈ వ్యా పారం కొనసాగిస్తున్నారు.

టపాసుల గోడౌన్ కు అ నుమతి లేదు జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్

బోరజ్ మండలం పౌజ్ పూ ర్ గ్రామం వద్ద అక్రమంగా తె రిచిన టపాసుల గోడౌన్ కు ఎలాంటి అనుమతి లేదని, దానిని మూ సివేయాలని నోటీసులు జారీ చేసినప్ప టికీ ఆ వ్యాపారి పెడచెవిన పెడుతున్నారని, జిల్లా అగ్ని మాపక అధికారి సురేష్ స్ప ష్టం చేశారు. ఆ టపాసులు పెద్ద మొత్తంలో నిల్వ చేసిన గోదాంకు ఎలాంటి రక్షణ కూ డా లేదని, తాను పలు మా ర్లు హెచ్చరించానని, త్వర లో ఉన్నతాధి కారుల అను మతితో ఆ గోడౌన్ ను సీజ్ చేస్తామని ఆయన తెలి పా రు. అక్రమంగా తెరిచిన ఆ గోడౌన్ టపాసుల వ్యాపారి పై శాఖ పరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నా రు.

జనవాసలే జంతువులకు ఆవసాలుగా మారయా!

మంచిర్యాలరూరల్
నవంబర్20(ప్రజాజ్యోతి)
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోతుల బెడద ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.ఇళ్లలోకి చొరబడుతూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం,చిన్నారులు, వృద్ధులపై దాడులకు దిగడం,పలువురిని కరవడంతో ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు.సమస్య తీవ్రతను గుర్తించిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టింది.కానీ ఈచర్యలు తాత్కాలిక ఉపశ మనానికే పరిమితమవుతాయా? కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ఆలోచిస్తున్నారా?అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ అధ్యక్షతన,కమిషనర్ అన్వేష



ఆధ్వర్యంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వైకుంఠం పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపడుతు న్నారు.పలు డివిజన్లలో ప్రణాళికాబద్ధంగా కోతులను పట్టుకుని ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి అటవీ ప్రాంతాల్లో వదులుతున్నారు.పాత మంచిర్యాల 14వ డివిజన్‌లో 218,వేంపల్లి 15వ డివిజన్‌లో 210, సున్నంబట్టివాడ 39వ డివిజన్‌లో 132,10వ డివిజన్‌లో 242 కోతులను పట్టుకున్నట్లు అధికారులు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

--కోతులను తరలిస్తే సరిపోతుందా?

కోతులను పట్టుకుని అడవుల్లో వదిలేయడం ఒక చర్య మాత్రమే.కానీ అవి తిరిగి జనావా సాల్లోకి రాకుండా ఉండేందుకు ఎలాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయి? నగరంలో కోతుల సంఖ్య పెరగడానికి గల ప్రధాన కారణాలపై అధికారులు అధ్యయనం చేశారా? కోతులకు సహజ ఆవాసాలు తగ్గిపోవడం, చెట్ల నరికివేత,పట్టణ విస్తరణ వంటి అంశాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం కోతులను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించడం ద్వారా సమస్య పూర్తిగా పరిష్కా రమవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

--ప్రజల ప్రాణాలకు భద్రత ఏది?

నివాస గృహాల్లోకి చొరబడుతున్న కోతులు బియ్యం,పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా ఎదురు పడిన వారిపై దాడులకు దిగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొం టున్నాయని చెబుతున్నారు.కోతుల దాడుల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం,ఫిర్యాదుల స్వీకరణ,అత్యవసర స్పందన వంటి వ్యవస్థలను కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

--రూ.650 ఖర్చు.. ఫలితం ఎంతకాలం?

ఒక్కో కోతిని పట్టుకుని తరలించేందుకు రూ.650 చొప్పున ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఇప్పటిపరకు ఎన్ని కోతులను పట్టుకున్నారు? మొత్తం ఎంత నిధులు ఖర్చు చేశారు?కాంట్రా క్టర్‌కు చెల్లింపులు ఏ ప్రాతిపదికన జరుగుతు న్నాయిపట్టుకున్న కోతులను ఎక్కడ వదులు తున్నారు?వాటి సంరక్షణ,భద్రతకు అటవీశాఖ అనుమతులు, పర్యవేక్షణ ఉన్నాయా? అనే అంశాలపై పారదర్శకత అ వ స ర ం. వ న ్యప్రాణుల ను పట్టుకోవడం,తరలించడం వంటి చర్యలు సంబంధిత అటవీశాఖ అనుమతులు, నిబంధనలకు అనుగుణంగా జరగాలి.

--కార్పొరేషన్తో పాటు అటవీశాఖ బాధ్యత తీసుకోవాలి!

కోతుల సమస్యను కేవలం పారిశుధ్య సమస్యగా చూడకుండా నగర పర్యావరణ సమస్యగా గుర్తించాలి.మున్సిపల్ కార్పొరేషన్,అటవీశాఖ సమన్వయంతో శాస్త్రీయంగా సమస్యను అధ్యయనం చేయాలి. కోతులకు సహజ ఆవాసాల పరిరక్షణ,చెట్ల పెంపకం, ప్రజలకు అవగాహన, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.అధికారులు చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమే.అదే సమయంలో ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడం,కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం పాలకవర్గం,అధికార యంత్రాంగం బాధ్యత. పట్టుకుని అడవుల్లో వదిలే కార్యక్రమం పూర్తయిన తర్వాత మళ్లీ అదే పరిస్థితి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే కోతుల బెడదకు పరిష్కారం పేరుతో ప్రజాధనం ఖర్చవుతున్నా ప్రజలకు మాత్రం ఉపశమనం లభించని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.

రోడ్డు మలుపుల దగ్గర స్పీడ్ బ్రేకర్లు వేయండి

-మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేసిన శిశు మందిర్ విద్యార్థులు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
నారాయణపేట జిల్లా మఖ్తల్ మున్సిపాలిటీ కేంద్రంలోని 13,14 వ వార్డు పరిధిలో గల వాకిటి వీధి,హనుమాన్ మందిరం,ఉత్తరాది మఠం దగ్గర ఉన్న రోడ్డు మలుపుల దగ్గర



వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పాదచారులు రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని,ముఖ్యంగా పాఠశాల సమయాల్లో చిన్నపిల్లలు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ ప్రాంతంలో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, ఆ రెండు మలుపుల దగ్గర అలాగే అవసరమైన ఇతర మలుపుల దగ్గర కూడా స్పీడ్ బ్రేకర్లు వేయాలని శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు,మున్సిపల్ కమిషనర్ రాజయ్య, వార్డు కౌన్సిలర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సరిత గోవిందరాజ్, పీకే నరసింహ, ముష్టిపల్లి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు,కాలనీ వాసులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంపత్ కుమార్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

-ఎర్రవల్లి మండల అధ్యక్షుడు నర్సి రెడ్డి ఆధ్వర్యంలో

-14వ సారి రక్తదానం చేసిన సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబు

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజా జ్యోతి)
నవంబర్ 20:అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీ.నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.
అన్ని దానాలకంటే రక్తదానం ఎంతో గొప్పదని ఆపదలో ఉన్నవారి ప్రాణాలను





కాపాడేందుకు రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.జన్మదిన సందర్భంగా పండ్లు,పలహారాలు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు.పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించడం కూడా ఎంతో అభినందనీయమన్నారు.రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ ప్రజలు డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ కి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని, ఆయన చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయాలు చేకూరాలని ఆకాంక్షిస్తూ రక్తదానం ద్వారా తమ అభిమానాన్ని,ఆశీర్వాదాలను తెలియజేశారు.
గద్వాల జిల్లా సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబు 14వసారి రక్తదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్య క్రమంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీ. నర్సిరెడ్డి,మాజీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,పీఏసీఎస్ చైర్మన్ మధు నాయుడు,వైస్ చైర్మన్ శ్యాంసుందర్ రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆదాము, మండల జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి పరిపూర్ణాచారి,పల్లె నిర్మలరాజు,కొండేరు వెంకటేష్,అల్లాబకాస్, కుమ్మరి తిరుపతి,బాల్ రామ్,షేక్‌పల్లి బీసీ రెడ్డి, నారాయణ, ఇబ్రహీం,నాగరాజు, ఇటిక్యాల పీటర్, ప్రభాకర్,వేముల తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ స్వయంభూ తిమ్మప్ప స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.24.66 లక్షలు

గత ఏడాదితో పోలిస్తే రూ.2.83 లక్షలు అధికం

మల్దకల్ నవంబర్ 20(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీ ద్వారా రూ.24,66,640 ఆదాయం లభించినట్లు ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి తెలిపారు.శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.గత సంవత్సరం హుండీ ద్వారా రూ.21,82,936 ఆదాయం రాగా,ఈ ఏడాది రూ.24,66,640 ఆదాయం వచ్చినట్లు వారు వెల్లడించారు.గత ఏడాదితో పోలిస్తే ఈసారి రూ.2,83,704 అధికంగా ఆదాయం సమకూరిందని తెలిపారు.అదేవిధంగా చింతలముని దేవాలయ హుండీ ద్వారా రూ.26,141 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో అభిలాష్ ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ సేవా సమితికి చెందిన 125 మంది సభ్యులు పాల్గొని లెక్కింపు నిర్వహించారు.అనంతరం





సేవా సమితి సభ్యులను ఆలయ చైర్మన్,ఈవో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,ఎస్‌వీ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు పట్వారి అరవిందరావు, చంద్రశేఖరరావు,బాబురావు,దేవాదాయ శాఖ సిబ్బంది,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల జీవితాన్ని తీర్చిదిద్దేది విద్యాలయాలే:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి
- ఘనంగా బాలల వారోత్సవాల ముగింపు వేడుకలు

గద్వాల నవంబర్ 20(ప్రజా జ్యోతి ప్రతినిధి):
విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని,వాటి సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.బాలల జీవితాలను తీర్చిదిద్దడంలో విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని,బాల్య దశ ప్రతి ఒక్కరి జీవితంలో అందమైన జ్ఞాపకంగా నిలవాలని ఆకాంక్షించారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన బాలల వారోత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.'మై డే..మై రైట్స్.. మై ఫ్యూచర్'అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి,మల్దకల్ ప్రాంతాల్లో బాల్యవివాహాల సమస్య ఎక్కువగా ఉందని,వాటి నిర్మూలనకు అధికారులు,ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు.చిన్న వయసులో వివాహాలు జరిపించడం వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.విద్యాసంస్థల్లో చైల్డ్ సేఫ్టీ అధికారులను నియమించడంతోపాటు దిశ,సఖి కేంద్రాలు,చైల్డ్ ప్రొటెక్షన్,ఉమెన్ సేఫ్టీ విభాగాలు బాలలు,మహిళల రక్షణకు కృషి చేస్తున్నాయని తెలిపారు.బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం,స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు.బాలలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఇటీవల పిల్లల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు గుర్తుచేశారు.

సెల్‌ఫోన్ల అనవసర వినియోగానికి దూరంగా ఉండాలి

విద్యార్థులు సెల్‌ఫోన్లను చదువుకు,విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు మాత్రమే వినియోగించాలని,గేమ్స్ ఆడటం,అనవసరమైన వీడియోలు,రీల్స్ చూడటం వంటి వాటికి దూరంగా ఉండాలని



కలెక్టర్ సూచించారు.సెల్‌ఫోన్ల అధిక వినియోగం వల్ల కంటి చూపు మందగించడం,మానసిక సమస్యలు,నిద్రలేమి వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.చిన్నపిల్లలకు అన్నం తినిపించేందుకు,ఇతర కారణాలతో తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు చేతికి ఇవ్వడం వల్ల చిన్న వయసులోనే వాటికి బానిసలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాల్యాన్ని చదువుకుంటూ,ఆటపాటలతో ఆనందంగా గడపాలని సూచించారు.

గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి

చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండేలా పిల్లలకు వివరించాలన్నారు.బాలికలతో పాటు బాలురు కూడా వేధింపులకు గురవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని,ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలలందరూ పాఠశాలల్లో విద్యనభ్యసించాలి

విద్యాహక్కు చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యనభ్యసించాలని కలెక్టర్ పేర్కొన్నారు.చదువుకునే వయసులో ఏ ఒక్కరూ బడికి దూరంగా ఉండకూడదన్నారు.పాఠశాలల్లో చదువుకోవడం ద్వారా విద్యతోపాటు మంచి స్నేహితులు,విలువలు అలవడతాయని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని,జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని,తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పని సరిగా బడికి పంపించాలని సూచించారు.

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటేనే ఆరోగ్యం

ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో మార్కెట్లో లభిస్తున్న జంక్‌ఫుడ్‌ను తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కలెక్టర్ తెలిపారు.ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండి,ఇంట్లో తయారుచేసిన పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.పిల్లల శారీరక ఎదుగుదల,జ్ఞాపకశక్తి పెంపునకు తల్లిదండ్రులు పౌష్టికాహారం అందించాలన్నారు.సెలవులు ముగిసిన వెంటనే విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యే అలవాటు చేసుకోవాలని, బద్ధకంతో విలువైన పాఠాలను కోల్పోవద్దని సూచించారు.విద్యాసంస్థల్లో వందశాతం హాజరు సాధించేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమని,



ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు.విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం బాలల వారోత్సవాలను పురస్కరించుకొని వివిధ విద్యాసంస్థల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్,ఇతర అతిథులు బహుమతులు అందజేశారు.అంతకుముందు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, అదనపు ఎస్పీ శంకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి సునంద,జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ,డీఐఈఓ హృదయరాజ్,డీసీపీఓ నరసింహ,బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) సభ్యులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇంటి ముందు ఆశావర్కర్లు ధర్నా

-ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పిక్స్డ్ వేతనం 18000 ఏమైంది

-హామీలు ఇవ్వడం కాదు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

-సిఐటియు జిల్లా అధ్యక్షులు సిఆర్ గోవింద్ రాజ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలో ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ సిఐటియు,బిఆర్ టియు, ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నివాసం వరకు ర్యాలీ నిర్వహించి ఇంటి ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆశ వర్కర్ల సమస్యల వినతి పత్రాన్ని మంత్రి పిఏ యాదవ రాజు వినతి పత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిఆర్ గోవింద్ రాజ్,మీస్కిన్ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలమణి,సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్,నరహరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు 28 వేల మంది పనిచేస్తున్నారని,ఆశావర్కర్లు గొంతెమ్మ కోరికలు కోరలేదు వాళ్ళ అడుగుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మీరు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పిక్స్డ్ వేతనం 18000/- చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ హామీగానే మిగిలిపోయింది తప్ప ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



కరోనా కష్టకాలంలో ప్రాణాలు తెగించి లెక్కచేయకుండా కరోనా బాధితులకు వైద్య సేవలు చేశారు.
ఒకవైపు కార్మికులను శ్రమ దోపిడీతో కొబ్బరి బొండంలా కార్మికులను పిండేస్తున్న కార్పొరేట్ శక్తులు,మరోవైపు వారికి వత్తాసు పలుకుతూ కార్మిక చట్టాలను అంగడి సరుకుగా మారుస్తున్న పాలకులు! పెట్టుబడుదారి శక్తుల దోపిడిని ప్రశ్నించే గొంతులంటే పాలకులకు ఎప్పుడు వణికే అందుకే ఆశా వర్కర్ల సత్తా గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడతదని చెప్పక తప్పదు. కార్మిక వర్గానికి కట్టు బానిసత్వానికి నెట్టే నాలుగు లేబర్ ప్రమోషన్ కల్పించాలి,
2 వ పి ఆర్ సి రూ. 30 వేలు వేతనం కల్పించాలి ఆశలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటిని అమలు చేయాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గోవిందమ్మ, అమీనా బేగం, యశోద, ఇందిరా, గౌరమ్మ, శాంతమ్మ, బాలమణి, పరిజన బేగం, ఏ సుజాత, పార్వతమ్మ, అనిత స్వప్న, పద్మ, వరలక్ష్మి , రంగమ్మ, నర్మదా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి
- లింగ నిర్ధారణ పరీక్షలపై నిరంతర తనిఖీలు చేపట్టాలి

గద్వాల నవంబర్ 20(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా మెరుగైన వైద్య సేవలు అందించి, సర్కారు దవాఖానాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ, సిబ్బంది అంకితభావంతో పనిచేయకపోతే ఆశించిన ఫలితాలు సాధించలేమన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య సేవలు అందించకుండా ఇతర ఆసుపత్రులకు అధిక సంఖ్యలో రెఫర్ చేస్తున్న విషయాన్ని గుర్తించామని, దీనిపై సంబంధిత సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్ల సిబ్బంది సైతం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే హైరిస్క్ కేసులను ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేయకుండా,సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.అవసరమైతే సమీపంలోని జిల్లా ఆసుపత్రులకు పంపించాలని తెలిపారు.24 గంటల పాటు వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, తమ విధులకు న్యాయం చేయాలని ఆదేశించారు.గట్టు వంటి మారుమూల ప్రాంతాల గర్భిణులు ప్రసవాల కోసం గద్వాల వరకు రావాల్సిన పరిస్థితి ఉండకూడదని,స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.వైద్య సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలని, త్వరలో గట్టు ప్రాంతంలో ఆకస్మికంగా పర్యటించి ఆసుపత్రులను తనిఖీ చేస్తానని తెలిపారు.

రక్తహీనత బాధితులను గుర్తించి చికిత్స అందించాలి

రక్తహీనత (అనీమియా) సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి తగిన వైద్య చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు.ప్రైవేటు ఆసుపత్రుల్లో అధికంగా శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు జరుగుతున్నాయని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు నిబద్ధతతో పనిచేయాలని అన్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని,దీని ప్రభావం సామాన్య ప్రజలపైనా ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడే పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడం భారంగా మారుతుందని,అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజలకు భరోసా కల్పించాలని సూచించారు.



లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పటిష్ట చర్యలు

ఇమ్యునైజేషన్ సేవలు,ఇతర వైద్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆరోగ్య మహిళ కార్యక్రమంలో గుర్తించిన కేసుల రెఫరల్ విషయంలో తగిన విధంగా స్పందించాలని సూచించారు.జిల్లాలో ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పకడ్బందీ తనిఖీలు నిర్వహించాలని,నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక ఆరోగ్య కార్డులు అందజేస్తున్నామని,ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు.ఇప్పటివరకు 7,388 మంది విద్యార్థులకు ఆరోగ్య కార్డులు అందజేసి,వివిధ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. అడోలెసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ సెంటర్ల సేవలను విస్తృతం చేయాలని,కౌమారదశలో ఉన్న పిల్లలకు ఆరోగ్య సంబంధిత అంశాలపై తరచూ అవగాహన,కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో సంధ్య కిరణ్మయి,ఇతర వైద్యాధికారులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునగాల గ్రామంలో సంపత్ కుమార్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్

అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి)నవంబర్ 20:
అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ జన్మ దిన వేడుకలు మునగాల సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి ఇటిక్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు వీరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంపత్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం



కాంగ్రెస్ ప్రజపాలనలో భాగంగా ఇందిరా జీవిత భీమా పథకం నమోదు కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి గ్రామ సెక్రటరీ గంగాధర్ డిసిసి జనరల్ సెక్రెటరీ జైపాల్ రెడ్డి,రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు ఉపరి ఆంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు రుక్మందర్ రెడ్డి,మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అల్లాబకాష్,గోవర్దన్, నరేష్ ,చాందుబాషా, ఇబ్రహీం,తిరుమలేష్, వెంకటస్వామి, మరియు గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలలో పాల్గొన్న బాసు హనుమంతు నాయుడు

గద్వాల (ప్రజా జ్యోతి) నవంబర్ 20:
గద్వాల నియోజక వర్గం పరిధిలోని వివిధ గ్రామాలలో జరిగిన వివాహ వేడుకలలో వారి ఆహ్వానం మేరకు గద్వాల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు పాల్గొని నూతన వధూవరులను తలంబ్రాలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్వలో ఇందిరమ్మ బీమా యాప్ ను ప్రారంభించిన అధికారులు

నర్వ నవంబరు 20 ప్రజా జ్యోతి
తెలంగాణ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఇందిరమ్మ బీమా పథకం యాప్ను శనివారం నర్వ గ్రామపంచాయతీ వద్ద ఎంపీడీవో శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ టి హనుమంత రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బి.సం చెన్నై సాగర్ లు పురారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం ఒక ధీమాగా నిలుస్తుందని వారన్నారు, ఆ గ్రామాలలో ప్రతి రేషన్ కార్డు కుటుంబ యజమానులు, తమ యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు ని తీసుకొని గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు, ఇది మాకు 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయసు గలగా వారికి వర్తిస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రాఘవేందర్ రావ్, మండల నర్వ గ్రామ పంచాయతీ సెక్రెటరీ కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శరణప్ప. ఉప సర్పంచ్ డి అజయ్, ఆత్మకూర్ మార్కెటింగ్ వైస్ చైర్మన్ డి కృష్ణ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి. వార్డు మెంబర్లు అయిలప్ప, తదితరులు పాల్గొన్నారు

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి

కొలుకొండలో ఘనంగా వివాహ మహోత్సవం

దేవరుప్పుల, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
దేవరుప్పుల మండలం కొలుకొండ గ్రామంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో పాలకుర్తి మండలం శాతపురం గ్రామ సర్పంచ్ లోనే శ్రీనివాస్ గారి కుమార్తె



కల్యాణి, ప్రశాంత్‌ల వివాహ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ హాజరై నూతన వధూవరులు కల్యాణి–ప్రశాంత్‌లను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచిన పదవ తరగతి స్నేహితులు

దేవరుప్పుల, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
అనారోగ్యంతో భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్న చిన్ననాటి స్నేహితురాలు పడమటిరెడ్డి అనూషకు 2008–09 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు.అనూష భర్త గండి యాదగిరి



అనారోగ్యంతో మృతి చెందాడని తెలుసుకున్న స్నేహితులు వెంటనే స్పందించి అందరూ కలిసి తమ వంతు బాధ్యతగా ఆర్థిక సహాయాన్ని సేకరించి శుక్రవారం కడవెండిలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో స్నేహితురాలికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న పదో తరగతి మిత్రులను గ్రామస్తులు పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో పడకండి శ్రీకాంత్, దండంపెల్లి నవీన్, పడమటింటి అనిల్, జేరిపోతుల భాస్కర్, కాశబోయిన ప్రశాంత్, జిట్టే స్వామి, మహేష్ తదితర చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

15 ఏళ్లుగా వేధింపులు.. న్యాయం చేయండి!

భూ వివాదంలో జోక్యం చేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న హోంగార్డు

పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడి ఆరోపణ

తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ అధికారులకు ఫిర్యాదు

పర్వతగిరి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
మండల కేంద్రానికి చెందిన పోలీస్ హోంగార్డు బొట్ల ఆశీర్వాదం తమ కుటుంబ ఆస్తి పంపకాల విషయంలో జోక్యం చేసుకుంటూ గత 15 ఏళ్లుగా తమను వేధింపులకు గురిచేస్తున్నారని పర్వతగిరికి చెందిన బొట్ల కొమరయ్య



ఆరోపించారు. తనకు రావాల్సిన భూమి వాటాను దక్కకుండా అడ్డుకోవడంతో పాటు, కుటుంబ సభ్యుల మధ్య తరచూ గొడవలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తన తండ్రి వారసత్వంగా సంపాదించిన పర్వతగిరి రిజర్వాయర్ పరిధిలోని రామన్న మిట్ట ప్రాంత భూముల పంపకాల విషయంలో ఆశీర్వాదం అనవసరంగా జోక్యం చేసుకుంటూ వివాదాలను పరిష్కారం కాకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. పర్వతగిరి ప్రధాన రహదారి నుంచి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ వాటర్ ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో తన తండ్రి తనకు కేటాయించిన 153 గజాల ఇంటి స్థలానికి అదనంగా, తన అన్న వాటాగా వచ్చిన మరో 153 గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే తన స్థలంలో కొంత భాగాన్ని ఆశీర్వాదం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కుల పెద్దలు, పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని వాపోయారు. అదేవిధంగా నెక్కొండ రోడ్డులోని భూమి విక్రయం ద్వారా 2017–18లో వచ్చిన రూ.80 వేలలో తన వాటాగా రావాల్సిన రూ.10 వేలు ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. 2019 నుంచి పంచాయతీ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జమ్మిచెట్టు సమీపంలోని తమ కుటుంబ ఇంటి స్థలాన్ని కూడా విక్రయించకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. తాను పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నానని, ఎస్ఐలు, సీఐలు, ఉన్నతాధికారులు తనకు తెలుసని, తనపై ఎవరూ ఏమీ చేయలేరంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కొమరయ్య ఆరోపించారు. తనతో పాటు కుటుంబ సభ్యుల పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపి తనకు రావాల్సిన ఆస్తి వాటాను ఇప్పించాలని, తనను మరియు తన కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని బొట్ల కొమరయ్య అధికారులను వేడుకున్నారు.

నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం - బబ్బూరి శ్రీకాంత్ గౌడ్

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు పుస్తె మట్టలు అందజేత

నిరుపేద బాధిత కుటుంబాలకు ఆపదలో అండగా ఆర్థిక సహాయాలు

సొంత ఊరు పెద్దమడూరుకు మహర్దశ

గుడులు గోపురాలకు విరివిరిగా విరాళాలు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు కృషి

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి

యువతకు ఆదర్శం పార్టీ బలోపేతానికి కృషి

దేవరుప్పుల, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
రాజకీయాన్ని సేవగా భావించి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న నాయకుడు ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్. గత



నాలుగేళ్లుగా చేస్తున్న సేవలు పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. తనకు జన్మనిచ్చిన సొంత ఊరు దేవరుప్పుల మండలంలోని పెద్దమడూరు గ్రామంలోని శ్రీ కంట్ల మహేశ్వర స్వామి ఆలయాన్ని సొంత డబ్బులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గోపురం, చుట్టు ప్రహరీ, భక్తులకు సౌకర్యాల కల్పనకు విరివిగా విరాళాలు అందజేశారు. అదే ప్రాంగణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సొంత ఖర్చుతో నెలకొల్పారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబమైనా, అనారోగ్యంతో ఉన్న బాధితుడైనా, ప్రమాదంలో గాయపడిన యువకుడైనా ఆపద అని తెలిస్తే చాలు స్పందించి ఆర్థిక సాయం అందిస్తున్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా పండల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. డబ్బులు లేక పెళ్లిళ్లు చేయలేక ఇబ్బంది పడుతున్న పేద తల్లిదండ్రులకు పుస్తెమట్టెలతో పాటు ఆర్థిక సహాయం అందజేసి ఆడబిడ్డల పెళ్లిళ్లు జరిపిస్తున్నారు. ఇప్పటివరకు పదుల సంఖ్యలో ఆడబిడ్డల పెళ్లిళ్లకు సాయం చేశారు.
పెద్దమడూరుతో పాటు ఇతర గ్రామాల్లోనూ గుడులు, గోపురాల నిర్మాణానికి విరివిగా విరాళాలు అందిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.
మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన శ్రీకాంత్ గౌడ్, ఆయన ఆశీస్సులతో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల కష్టాల్లో ఉంటూ సేవ చేస్తున్నారు. యువతను బీఆర్ఎస్ లోకి ఆహ్వానిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేసే నిస్వార్థ నాయకుడిగా బబ్బూరి



శ్రీకాంత్ గౌడ్ నిలుస్తున్నారు.

బాలల హక్కుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

హనుమకొండలో వాకథాన్
కళాజాత ద్వారా బాలల హక్కులపై అవగాహన

హనుమకొండ జిల్లా ప్రతినిధి,
నవంబరు 20, (ప్రజాజ్యోతి):
బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలో వాకథాన్ నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా బాలల



పరిరక్షణ విభాగం, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో పోలీస్ కమిషనరేట్ నుంచి కలెక్టరేట్ వరకు ఈ కార్యక్రమం చేపట్టారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, డాన్ బాస్కో నవజీవన్, షేర్ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నిర్వహించిన వాకథాన్‌ను జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ రమేష్, బాలల న్యాయ మండలి సభ్యురాలు డాక్టర్ గోపికా రాణి, కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె. అనితారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కళాజాత బృందం పాటల ద్వారా బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన, మానవ అక్రమ రవాణా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల



అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులకు ప్రాధాన్యం ఉందన్నారు. వీటికి ఎలాంటి భంగం కలగకుండా చూడాలని పేర్కొన్నారు.
'నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్తు' అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాల ద్వారా బాలలు తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి బెలూన్లు ఎగురవేసి, సంతకాల ప్రచారంలో పాల్గొన్నారు.
కార్యక్రమంలో బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్ అవంతి, సిస్టర్ సహాయ, ఫాదర్ కోషి, ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, ఇన్‌ఛార్జి డీసీపీఓ ఎన్. ప్రవీణ్ కుమార్, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఆత్మకూరు, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను గ్రామాలలో పకడ్బందీగా, వేగవంతంగా



పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం బ్రాహ్మణపల్లి, దామెర మండలం వెంకటాపూర్ గ్రామాలలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీసర్వే వివరాలు, జరుగుతున్న తీరును సర్వేయర్లను, స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామారం సర్పంచ్ తోట లక్ష్మి కుమారస్వామి, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, దామెర తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, సర్వేయర్లు, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతులను పరిశీలించిన అదనపు కలెక్టర్:
ఆత్మకూర్ మండలం తిరుమలగిరి గ్రామంలో ఉన్న



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ని అదనపు కలెక్టర్ ఎన్. రవి శుక్రవారం సందర్శించారు. హాస్టల్లోని బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యవసరాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగదిలోని భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థిను లతో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బూర దేవేంద్ర రాజేందర్, కేజీబీవీ ప్రత్యేక అధికారి, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరిక్షలు జరిపితే కఠిన చర్యలు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి) :
జిల్లాలోని ఆసుపత్రులు స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ అన్నారు. శుక్రవారం, జిల్లా కేంద్రంలో గల వేంకటేశ్వర స్కానింగ్ కేంద్రం, విజయ ఆసుపత్రి, లక్ష్మి స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా. వాణి శ్రీ, ప్రోగ్రాం అధికారులతో కలిసి సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు ఎవ్వరైనా చేసినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని , పిసిపిఎన్డిటి చట్టం, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గర్భిణీ స్కానింగ్ రికార్డ్ లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. హరికృష్ణ, సీహెచ్ఓ సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఆత్మకూరు, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం తిరుమలగిరి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఆన్లైన్ నమోదు ప్రక్రియ చేస్తుండగా జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. గ్రామస్తుల వివరాలను ఆన్లైన్ విధానంలో బీమా కోసం నమోదు చేస్తుండగా పరిశీలించారు. ఆన్లైన్ నమోదు ప్రక్రియకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి



తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. బీమా నమోదు ప్రక్రియను గ్రామంలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బూర దేవేంద్ర రాజేందర్ , తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో కుటుంబాలకు ఆర్థిక భరోసా

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం, జనగామ మండలంలోని ఓబుల్ కేశవాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్



కుమార్ ఝా హాజరై, లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ పథకం వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద రాష్ట్రంలోని కోటి పైచిలుకు కుటుంబాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. తద్వారా ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ సభ్యుల పేరు మీద బీమా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. పుట్టిన తేదీ నిర్ధారణకు ఆధార్ కార్డులో ఉన్న తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారని, క్యాంపులకు వచ్చే ముందు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. ఈ పథకంలో పేద, ధనిక, ఏపీఎల్, బీపీఎల్ అనే తేడాలు లేవని, గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతు బీమా ఉన్న వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని, రైతు బీమాతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీమా ద్వారా వచ్చే మొత్తాన్ని ఎవరికి ఎంత వాటా ఇవ్వాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు ఉంటే దానిని సమర్పించాలని, లేని పక్షంలో అందుబాటులో ఉన్న ఫారాన్ని పూర్తి చేసి ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీలో నిర్దేశించిన వ్యవధి లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపులకు తరలి వచ్చే లబ్ధిదారులకు తగిన వసతులు కల్పించాలని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం ఓబుల్ కేశవాపురం గ్రామ పంచాయతీలో డ్రైనేజీ, రోడ్లు, పాఠశాలల మరమ్మతులు, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి దాదాపు రూ. 2 కోట్ల 95 లక్షలు కలెక్టర్ మంజూరు చేసినందున, గ్రామంలో అన్ని వసతులను సమకూర్చి నందున గ్రామ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో బలరామ రావు, డీఆర్డీఓ రాపర్తి భాస్కర్, ఎంపీడీవో మహేష్ నాయక్, ఎంపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, అధిక సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శాలిగౌరారంలో నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష

శాలిగౌరారం / నల్గొండ జిల్లా ప్రతినిధి : నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
మండల కేంద్రం శాలిగౌరారంలో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో, అలాగే ఎల్‌నినో ప్రభావంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి తుంగతుర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ మందుల సామేలు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే నీటి ఎద్దడి, వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే పరిస్థితులపై సంబంధిత శాఖల



అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం నూతన చేయూత పింఛన్లకు అర్హత సాధించిన లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తదితరుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి , శాలిగౌరారం మండల ప్రత్యేక అధికారి రమాదేవి , ఎంపీడీవో రమేష్ , తహసీల్దార్ మాధవరావు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంపటి లో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ఘనంగా ప్రారంభం!

తుంగతుర్తి, నవంబర్ 20,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామపంచాయతీ లో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా కార్యక్రమాన్ని తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో చలపతి శుక్రవారం గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్యతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ... ప్రతి కుటుంబానికి రూ.5లక్షల జీవిత భీమా భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని తెలిపారు.
భీమా ప్రయోజనాలు, నమోదు విధానం, అవసరమైన పత్రాల గురించి అధికారులు వివరంగా వివరించారు. కుటుంబానికి అండగా నిలిచే ఈ పథకంలో అర్హులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని, కష్టకాలంలో అండగా నిలుస్తుందని 1 పేర్కొన్నారు. పేదలకు అండగా నిలిచే ఈ పథకం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ సందీపు కుమార్, పంచాయతీ కార్యదర్శి వీరేందర్, జిపిఓ మౌలాన, ఉప సర్పంచ్ దాసరి మంజుల రామచంద్రు,అంగన్వాడీ సిబ్బంది, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గోరింకలపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ

విద్యార్థులకు ఎల్‌నినోపై అవగాహన

నకిరేకల్ / నల్గొండ జిల్లా ప్రతినిధి: నవంబర్ 20; (ప్రజా జ్యోతి)
గోరింకలపల్లి గ్రామాన్ని గౌరవ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించి స్థలాలను పరిశీలించి, వ్యక్తిగత ఇంకుడు గుంతలతో పాటు కమ్యూనిటీ



ఇంకుడు గుంతల ఏర్పాటుకు మార్కింగ్ చేశారు. అనంతరం కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఎల్లయ్యతో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంలో ఇంకుడు గుంతల ప్రాధాన్యతను వివరించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జల ప్రతిజ్ఞ చేయించి, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఎం. ప్రకాష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్రుర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

నకిరేకల్ / నల్లగొండ జిల్లా ప్రతి నిధి : నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
నకిరేకల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మార్రుర్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిం





చారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం గురించి వివరించి, పథకం యొక్క ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.
అదేవిధంగా జలసిరి పనులకు సంబంధించిన వివరాలను కూలీలకు తెలియజేశారు. అనంతరం జలసిరి పనులకు సంబంధించి నిర్వహించిన మార్కింగ్ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని పనుల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

మేకలు, గొర్రెల పెంపకందారులు ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలి:సర్పంచ్ కలకోట్ల మల్లేష్

తుంగతుర్తి, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
మేకలు, గొర్రెల పెంపకందారులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలు, సారక మందులను సద్వినియోగం చేసుకోవాలని సంగెం గ్రామ సర్పంచ్ కలకోట్ల మల్లేష్ సూచించారు. శుక్రవారం తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం గ్రామంలో మేకలు, గొర్రెలకు ఉచితంగా సారక మందులు పంపిణీ చేసి, టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేష్ మాట్లాడుతూ.. మేకలు, గొర్రెలకు సకాలంలో టీకాలు వేయించడం, నట్టల నివారణకు సారక మందులు అందించడం ద్వారా వాటిని వివిధ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. పశుసంపద ఆరోగ్యంగా ఉంటేనే పెంపకందారులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రతి పెంపకందారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రవి, ఉప సర్పంచ్ నీలమ్మ ముత్తయ్య, వార్డు సభ్యుడు సోమేష్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని ఆర్డీఓ కృష్ణ రెడ్డి తో కలిసి ప్రారంభించిన,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భువనగిరి,నవంబర్ 20(ప్రజాజ్యోతి):
భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్య క్రమాన్ని భువనగిరి ఆర్డీఓ కృష్ణ రెడ్డి తో



కలిసి,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ముఖ్య మంత్రి, రేవంత్ రెడ్డి నాయక త్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన వ్యక్తులకు జీవిత బీమా సౌకర్యం కల్పించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రజా ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలను ప్రకటించడమే కాకుండా, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ కుటుంబాల భవిష్యత్తుకు భరోసా



కల్పిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచిం చారు. అనంతరం గ్రామంలో సూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ భవనం ద్వారా మహిళా సంఘాలు మరింత బలోపేతం కావడంతో పాటు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించి స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంపల్లిపీఏసీఎస్ చైర్మన్ పక్కిర్ కొండల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లంల జంగయ్య యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పాలక వర్గం,అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్

నకిరేకల్ / నల్లగొండ జిల్లా ప్రతినిధి: నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
మండల న్యాయ సేవా కమిటీ నకిరేకల్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో మత్తుపదార్థాల దుష్ప్రభావాలు, బాలల హక్కులు,



చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ కుమారి మంజుల సూర్యవర్ మాట్లాడుతూ.. బాలల రక్షణ కోసం అమలులో ఉన్న వివిధ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. బాల నేరాలకు సంబంధించిన ప్రత్యేక న్యాయస్థానాలు, పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, 18 సంవత్సరాల లోపు బాలబాలికలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమనే విషయాలను మోటార్ వాహనాల చట్టం ద్వారా వివరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. బాలల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా ఉండాలని, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. జీవితంలో ఉన్నత



స్థాయికి ఎదగాలంటే మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ, మంచి మార్గంలో పయనించాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా విద్యార్థులు తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతర బాలల భద్రతకు కూడా తోడ్పడగలరని అన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, రక్షణ, గౌరవప్రదమైన జీవితం అందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నోముల గోవిందరాజులు, బట్టు విజయ్, పాఠశాల ప్రిన్సిపాల్ కాటన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో భువనగిరి ఎంపీ చామల సమీక్ష

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి – అధికారులకు ఎంపీ, కలెక్టర్ ఆదేశాలు

శాలిగౌరారం: నల్గొండ జిల్లా ప్రతినిధి :నవంబర్ 20: (ప్రజా జ్యోతి)
శాలిగౌరారం మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల



పురోగతి, పెండింగ్ పనులు, ప్రజా సమస్యలపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. శాలిగౌరారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. సమావేశానికి విచ్చేసిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ పూల మొక్కను అందించి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల స్థితిగతులు, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న పనులు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపీ, కలెక్టర్ అధికారులతో సమగ్రంగా చర్చించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, శాలిగౌరారం మండల ప్రత్యేక అధికారి రమాదేవి, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ మాధవరావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్

నకిరేకల్ నల్లగొండ జిల్లా ప్రతినిధి :నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ డిమాండ్ చేశారు.శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ స్వగృహంలో నిర్వహించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై వ్యక్తిగత



విమర్శలు చేసే నైతిక హక్కు పున్న కైలాష్‌కు లేదన్నారు. పదవుల కోసం కోమటిరెడ్డి సోదరులపై విమర్శలు చేయడం తగదని, వారి రాజకీయ ప్రస్థానాన్ని, ప్రజాసేవను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు.
కోమటిరెడ్డి సోదరులు నల్గొండ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు కలిగిన నాయకులని, వారి సేవలను జిల్లా ప్రజలు గుర్తిస్తారని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణ గురించి మాట్లాడే ముందు డీసీసీ అధ్యక్షుడు తన కార్యక్రమాల్లో పార్టీ ప్రోటోకాల్‌ను పాటిస్తున్నారా? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫొటోను కార్యక్రమాల్లో ఏర్పాటు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.
డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పున్న కైలాష్ క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను ఎంతవరకు కలిశారని నిలదీశారు. కేవలం పది మందితో జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్లు నిర్వహించినంత మాత్రాన పార్టీ బలోపేతం కాదని, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగినప్పుడే పార్టీకి బలం చేకూరుతుందని సూచించారు.
డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగేందుకు పున్న కైలాష్‌కు నైతిక అర్హత లేదని, తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దైద రవీందర్ డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి సోదరులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.
ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఛత్రపతి, బొల్లెపల్లి సర్పంచ్ వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, ఆరేగూడెం సర్పంచ్ నాగంపల్లి శ్యామ్, అన్నారం సర్పంచ్ సైదులు, ముక్కామల శేఖర్, మాజీ డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి మాద లింగస్వామి గౌడ్, కట్టంగూరు మాజీ పట్టణ అధ్యక్షుడు చెరుకు యాదగిరి, రంగు వీరయ్య, వెంకటేష్, చీకటి గూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీను, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోస్, చెరుకు సైదులు, చెరుకు యాదయ్య, నాగరాజు, నవీన్, యాకోబు, చారి తదితరులు పాల్గొన్నారు.

భార్యతో మాట్లాడుతున్నాడనే కక్షతో వ్యక్తి దారుణ హత్య

ట్రాక్టర్‌పై వెళ్తున్న మహేష్‌ను కత్తితో మూడుసార్లు పొడిచి హతమార్చిన నిందితుడు

తుంగతుర్తి, నవంబర్ 20,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో దారుణ హత్య చోటుచేసుకుంది. తన భార్యతో మాట్లాడుతున్నాడనే



అనుమానంతో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరో వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన గ్రామంలో కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంపటి గ్రామానికి చెందిన చామకూరి మహేష్ (తండ్రి యాదయ్య) తన భార్యతో మాట్లాడుతున్నాడనే కక్షను మనసులో పెట్టుకున్న అదే గ్రామానికి చెందిన రామణబోయిన మహేష్ (తండ్రి మల్లయ్య) అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నారుమడి దున్నడానికి ఉదయం ట్రాక్టర్ పై వెళ్తున్న చామకూరి మహేష్ ను వెంపటి గ్రామ శివారులోని గన్నెకుంట బాటలో చంటి యాకయ్య పొలం వద్ద అడ్డగించి, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఛాతీ భాగంలో మూడుసార్లు పొడిచాడు. తీవ్ర గాయాలపాలైన చామకూరి మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి తండ్రి చామకూరి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

బాల్కొండలో మల్లన్న ముఖద్వారం ప్రారంభోత్సవం



బాల్కొండ, (ప్రజా జ్యోతి) నవంబర్ 20: బాల్కొండ మండల కేంద్రంలోనేడు సుప్రసిద్ధ దేవస్థానం మల్లన్న ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవం అతి పురాతన ఆరాధ్య పుణ్యక్షేత్రం మల్లన్న దేవలయం ముఖద్వారం కామన్ ఆలయ కమిటీ కొత్తూరు సాగర్ నేతృత్వంలో గ్రామపెద్దల ప్రజల సౌజన్యంతో ఏర్పాటు చేస్తూ స్థాపించారు ఈ సందర్భంగా మల్లన్న కమిటీ అధ్యక్షుడు కొత్తూరు సాగర్ గ్రామ సర్పంచ్ గాండ్ల రాజేష్,విడిసి అధ్యక్షులు ఏళ్ళె రాజేశ్లు మాట్లాడుతూ సుదూర ప్రాంతాలనుండి అలయనికి వచ్చే భక్తులకు అలయం ఆనవాళ్లు తెలియజేసే క్రమంలో మంచి ఆలోచనచే.కామన్ ముఖద్వారం ఏర్పాటు చేయడం చాలా అభినందనియం అంటూ అలయకమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు అర్చకస్వామి దత్తు పంతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మగ పూర్ణిమకు 5 రోజులపాటు మల్లన్న జాతర ఉత్సవాలు జరుగుతాయని అందరికి శుభాలు కలగాలని అకక్షించారు.జైమల్లన్న కు అంటూ ఈశ్వర నామస్మరణ చేశారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ గ్రామపెద్ద మనుషులు, మల్లన్న కమిటీ సభ్యులు, పంచాయతీ వార్డ్ సభ్యులు, విడిసి సభ్యులు మరియు పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, బరిగేడీ మల్లేష్,బండి మల్లేష్,గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ● బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి





రెంజల్, నవంబర్ 20(ప్రజాజ్యోతి): అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించి సామాజిక భద్రత అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్షమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు.రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరు అయినా చేయూత పింఛన్లు మరియు ఇందిరమ్మ ఇండ్ల ధ్రువ పత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తెలంగాణలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలులోకి తెచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇప్పటికే ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు.రైతులకు రూ.23 వేల కోట్ల మేర పంట రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పిస్తూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు.పార్టీలకు అతీతంగా పేదల సంక్షేమమే పరమావధిగా అన్ని ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్బయిన్ హందన్, ఎంపీడీఓ వారణాసి కమలాకర్, కాంగ్రెస్ పార్టీ మండలధ్యక్షుడు మోబిన్ ఖాన్, సొసైటీ చైర్మన్లు జావిదోద్దిన్, సాయిరెడ్డి, సర్పచులు తిరుపతి లలితబుజ్జి, లచ్చావార్ సుహాసినినితిన్, మాదవిసాయిలు, సుమలతరాజు, మల్లేష్, ధనురి నర్సవ్వ అబ్బయ్య, అనితనరేష్, ధనుంజయ్, జుబేరోద్దిన్, మల్లేష్, తెలంగాణ శంకర్, యోగేష్, భానుచందర్,ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ

పనులను పరిశీలించిన పోచారం శ్రీనివాసరెడ్డి





కోటగిరి, నవంబర్ 20, ప్రజా జ్యోతి. బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత సమయంలోగా త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోచారం గారి వెంట వర్ని, బాన్సువాడ గ్రామీణ మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, సిద్దాపూర్ పరిసర గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు

● 108 మందికి అన్నదానం

● వృద్ధాశ్రమంలోని 23 మంది వృద్ధులకు చీరలు, ఆహారం, మష్లర్లు, మంకీ క్యాప్స్ పంపిణీ



కామారెడ్డి, రూరల్ నవంబర్ 20 (ప్రజాజ్యోతి) భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కామారెడ్డి పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బాబా వారి "మానవ సేవే మాధవ సేవ" సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని భక్తులు ప్రేమతో, భక్తితో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా 108 మంది నారాయణులకు అన్నదానం నిర్వహించారు. అలాగే కామారెడ్డిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న 23 మంది వృద్ధులకు చీరలు, ఆహారం, మష్లర్లు, మంకీ క్యాప్స్ పంపిణీ చేశారు. వృద్ధులకు అవసరమైన వస్తువులను అందజేస్తూ వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. భగవంతుడిని సేవించడం అంటే కష్టాల్లో ఉన్న మానవులకు సేవ చేయడమేనని, సేవా కార్యక్రమాల ద్వారా బాబా వారి బోధనలను ఆచరణలో పెట్టడమే నిజమైన భక్తి అని నిర్వాహకులు పేర్కొన్నారు.

రూ.10 లక్షల వికసిత్ భారత్ జి రామ్ జి నిధులతో

మహిళా సంఘ భవన నిర్మాణానికి ముగ్గు

● మహిళా సంఘాలకు సొంత భవనం కల్పించడమే లక్ష్యం



కామారెడ్డి రూరల్, నవంబర్ 20 (ప్రజాజ్యోతి) కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో వి.బి.జి. రామ్ జి నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి గురువారం ముగ్గు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలకు సొంత భవనం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ నర్సింలు, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, వార్డు సభ్యులు గంగారెడ్డి, పద్మ, శిరీష, సీసీ, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి, వివిధ సంక్షేమ కార్యక్రమాలపై చర్చించుకోవడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామస్థులు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరిగేందుకు ఈ భవన నిర్మాణం దోహదపడుతుందని పేర్కొన్నారు.

గ్రామగ్రామాన ముదిరాజ్ జెండా ఆవిష్కరణకు పిలుపు

● నవంబర్ 21న ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవం, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



అందోల్, నవంబర్ 20, (ప్రజాజ్యోతి): ముదిరాజ్‌ల ఐక్యత, ఆత్మగౌరవం, సంఘటిత శక్తిని చాటేలా నవంబర్ 21న తెలంగాణ ముదిరాజ్ మహాసభ 12వ వార్షికోత్సవం, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పి. నారాయణ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పల్లె, గ్రామం, పట్టణంలో ముదిరాజ్ జెండాలను ఆవిష్కరించి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్, ముదిరాజ్ నియోజకవర్గ కన్వీనర్ డి.బి. నాగభూషణం, చాపల వెంకటేశం, మాసానిపల్లి సర్పంచ్ బంటు సత్యనారాయణ, ఉపసర్పంచ్ రాజు, మాజీ ఉపసర్పంచ్ ప్యాట కృష్ణమోహన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిన్నగారి కృష్ణ, పి. సంజయ్, బుచ్చయ్య, అర్జున్, యాదయ్య, శంకర్, గురువయ్య, ప్రవీణ్ కుమార్ తదితర ముదిరాజ్ బంధువులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు బస్వ మాణయ్య సేవలు చిరస్మరణీయం

● నిజాం నిరంకుశ పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఉక్కు మనిషి





అందోల్, నవంబర్ 20, (ప్రజాజ్యోతి): అందోల్ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ బస్వ మాణయ్య జయంతి వేడుకలను జోగిపేట పట్టణంలోని చారిత్రాత్మక క్లాక్ టవర్ మధ్య రంగం వద్ద జోగిపేట మున్సిపల్ పట్టణ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పట్టణ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన జయంతి సభలో వక్తలు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా బస్వ మాణయ్య చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. తన పోరాటంతో గ్రామీణ ప్రజల్లో చైతన్యం నింపి రజాకార్లను తరిమికొట్టడంలో కీలక పాత్ర పోషించిన ధైర్యశాలి అని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రోత్సాహమిచ్చి, అస్పృశ్యత నిర్మూలన, కుల వివక్షకు వ్యతిరేకంగా కృషి చేసిన మహనీయుడని గుర్తుచేశారు. జోగిపేట పట్టణ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు చిరస్మరణీయమన్నారు. బస్వ మాణయ్య జీవిత చరిత్ర, ప్రజాసేవ, పోరాట స్ఫూర్తిని భావితరాల విద్యార్థులకు తెలియజేసేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు డి.బి. నాగభూషణం ముదిరాజ్, ఎం. మల్లికార్జున్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం ముదిరాజ్, సార శ్రీధర్, బిర్ల శంకర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ డాకూరి శివశంకర్, కౌన్సిలర్ అరుణ్ కుమార్, బస్వ మాణయ్య కుటుంబ సభ్యులు బస్వ యుధిష్టర్, గాయత్రి, ఐత్రి, బస్వ సత్యప్రకాష్, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

ముచ్చర్లలో వరి కోత మిషన్

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ యంత్రం దగ్ధం



హత్నూర 20 నవంబర్ (ప్రజా జ్యోతి) విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ (వరికోసే మిషన్)యంత్రం కాలి బూడిదైన సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.గ్రామ శివారులో ఓ రైతు వ్యవసాయ పొలంలో హార్వెస్టర్ మిషన్ తో వరి కోస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి మంటలు చేలరేగి మిషన్ పై పడ్డాయి.దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించినట్లు తెలిపారు.వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వాహనం నుండి కిందకు దిగి పరుగు తీయగా భారీగా చెలరేగిన మంటలకు హార్వెస్టర్ మిషన్ పూర్తిగా కాలి బూడిదయింది. వెంటనే ఫైర్ ఇంజన్ సమాచారం ఇవ్వగా హుటా హుటిగా సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పడం జరిగింది ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కుటుంబానికి పెద్ద దిక్కు.. ఇందిరమ్మ బీమా!

● ఆపదలో ఆదుకునేలా రూ.5 లక్షల జీవిత భద్రత ● పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపనున్న ప్రభుత్వ పథకం





అందోల్, నవంబర్ 20, (ప్రజాజ్యోతి): కుటుంబాన్ని పోషించే పెద్ద వ్యక్తి అకస్మాత్తుగా దూరమైతే ఆ ఇంటి పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆదాయం నిలిచిపోవడం, పిల్లల చదువులు, కుటుంబ పోషణ, అప్పుల భారం.. ఇలా ఎన్నో సమస్యలు ఆ కుటుంబాన్ని చుట్టుముడతాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా కల్పించనుంది.

ఆపదలో రూ.5 లక్షల అండ

కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా రూ.5 లక్షల జీవిత బీమా అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఆధారంగా ఈ పథకం వర్తించనుంది. అనుకోని ఆపద ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించడంతో పాటు భవిష్యత్తుపై భరోసా కల్పించనుంది. పేద కుటుంబాలకు జీవిత భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది.

రెండో వార్డులో శ్రీకారం

ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో అందోల్--జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో కౌన్సిలర్ కోషికే రాజశేఖర్ అధ్యక్షతన పథకాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మున్సిపల్ కమిషనర్ తిరుపతి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలైన లక్ష్యం ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమేనని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం వివరాలను తెలుసుకొని ప్రయోజనం పొందాలని సూచించారు. ప్రజలకు సామాజిక భద్రత కల్పించే ఇలాంటి కార్యక్రమాలు కుటుంబాల భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్. సురేందర్‌గౌడ్, కౌన్సిలర్లు పట్లోళ్ల శ్రీనివాస్, మర్రి అరుణకుమారి, తోట్ల రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు పిట్ల భాగ్యలక్ష్మి, పిట్ల లక్ష్మణ్, దేవిడ్, మాజీ కౌన్సిలర్లు ప్రదీప్‌గౌడ్, అల్లే శ్రీకాంత్, దుర్గేష్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పడిగే సత్యం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన వికాసానికి వేదికగా మండల స్థాయి క్విజ్ పోటీలు

★ మండల స్థాయి క్విజ్ పోటీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



నవంబర్ 20 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడం మరియు సాధారణ పరిజ్ఞాన (జనరల్ నాలెడ్జ్) పట్ల ఆసక్తిని కలిగించాలనే ఉన్నత లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో, చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలోని కేజీ వీబీ పాఠశాలలో,జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలు కేజీవీబీ మరియు మోడల్ స్కూల్ లలోవిద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించడం జరిగింది. శుక్రవారం కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. క్విజ్ జరుగుతున్న తీరును, విద్యార్థులకు అడుగుతున్న జనరల్ నాలెడ్జ్, సైన్స్, గణితం మరియు సాంఘిక శాస్త్ర ప్రశ్నల ప్రమాణాలను పరిశీలించారు.విద్యార్థులతో పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో మాట్లాడి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూవిద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షలలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాలతో పాటు సమకాలీన అంశాలపై (కరెంట్ అఫైర్స్) అవగాహన పెంచుకోవాలని సూచించారు.విద్యార్థుల్లో పుస్తక పఠనం మరియు వార్తాపత్రికలు చదివే అలవాటు పెరిగిందని సూచించారు.రాబోయే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు సిద్ధమవడానికి ఇది ఒక చక్కని వేదికగా మండల స్థాయి క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ఇలాంటి విద్యా సంబంధిత కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

★ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో కుటుంబాలకు ఆర్థిక భరోసా
★ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







నవంబర్ 20 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమమని లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం, మెదక్ జిల్లాలో చేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై, లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ పథకం వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ముఖ్య ఉద్దేశం

సాధారణంగా ఎల్ఐసీ వంటి జీవిత బీమా పథకాల కోసం ప్రజలు ప్రతి ఏటా సొంతంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద రాష్ట్రంలోని కోటి పైచిలుకు కుటుంబాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. తద్వారా ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. అర్హత వయసు18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ సభ్యుల పేరు మీద బీమా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. పుట్టిన తేదీ నిర్ధారణకు ఆధార్ కార్డులో ఉన్న తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారని, క్యాంపులకు వచ్చే ముందు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును వెంట తీసుకు రావాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపు

ఈ పథకంలో పేద, ధనిక, ఏపీఎల్, బీపీఎల్ అనే తేడాలు లేవని, గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతు బీమా ఉన్న వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని, రైతు బీమాతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాకు ఎలాంటిసంబంధం లేదని స్పష్టం చేశారు.

నామినీ ఎంపిక లబ్ధిదారుడిదే

బీమా ద్వారా వచ్చే మొత్తాన్ని (ఉదాహరణకు రూ.5 లక్షలు) ఎవరికి ఎంత వాటా ఇవ్వాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. పిల్లల పేరు మీద గానీ, భార్యాభర్తల పేరు మీద గానీ, ఇద్దరు పిల్లలు ఉంటే 50-50 శాతం (లేదా) ఇతర విధంగా తమ ఇష్టానుసారం వాటాలను కుటుంబ సభ్యులు నిర్ణయించుకోవచ్చని వివరించారు.ఈ గ్రామంలో సుమారు 700 కుటుంబాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఈఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు ఉంటే దానిని సమర్పించాలని, లేని పక్షంలో అందుబాటులో ఉన్న ఫారాన్ని పూర్తి చేసి ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఫారంలో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, అనంతరం నమోదు చేసిన వివరాలను మరోసారిసరిచూసుకోవాలని తెలిపారు.గతంలో రైతు బీమా నమోదు చేసుకున్న వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో నిర్దేశించిన వ్యవధి లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపులకు తరలి వచ్చే లబ్ధిదారులకు తగిన వసతులు కల్పించాలని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డి డబ్ల్యు ఓ హేమ భార్గవి , ఎంపీడీవో చెన్నారెడ్డి, తాసిల్దార్ బాల లక్ష్మి గ్రామ సర్పంచ్ దుర్గా రామ గౌడ్ ,సిబ్బంది, అధిక సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 30 రోజుల జైలు శిక్ష

★ రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం
★ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు
★ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు



నవంబర్ 20 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై పోలీసులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 18వ తేదీన నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ఏ. రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న నర్సాపూర్‌కు చెందిన వడ్ల అన్నమాచారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి నర్సాపూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి అతనికి 30 రోజుల జైలు శిక్ష విధించారు. కోర్టు ఆదేశాల మేరకు శిక్ష పడిన వ్యక్తిని సంగారెడ్డి జిల్లా కందిలోని జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైజరిమానాలతో పాటు జైలు శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మద్యం సేవించిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

యువత ఆరోగ్యమే లక్ష్యం

★ మిట్టపల్లిలో రూ.6 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు ★ సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్





సిద్దిపేట అర్బన్, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):- గ్రామంలో యువత ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించడమే లక్ష్యంగా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో మండల, గ్రామపంచాయతీ సంయుక్త నిధులు రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ ను శుక్రవారం గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడలు, వ్యాయామంపై ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలనే ఉద్దేశంతో జిమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి జీవనశైలిలో శారీరక వ్యాయామం ఎంతో అవసరమని, యువత ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. గ్రామ పంచాయతీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు పట్ల గ్రామ యువత, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, ఉప సర్పంచ్ వాణి కిషన్, వార్డ్ మెంబర్లు జేపీ యాదవ్, రాజు, వెంకట్,మఠం రాజు, ఐ చెంద్రం, ఫయాజ్,మల్లేశం మాజీ సర్పంచ్ పయ్యావుల రాములు, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ కేకే మల్లేశం గ్రామ ప్రజలు యువత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పక్షికి ప్రాణదానం

★ ముళ్ల పొదల్లో చిక్కుకున్న నెమలిని కాపాడిన వేల్పుగొండ గ్రామస్తులు.!



టేక్మాల్, నవంబర్ 20: ప్రజా జ్యోతి. వేల్పుగొండ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అద్భుతమైన మానవత్వాన్ని చాటుకున్నారు. ముళ్ల పొదల్లో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న జాతీయ పక్షి నెమలిని సురక్షితంగా కాపాడి, శుక్రవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గ్రామ చెరువు సమీపంలోని గుట్టపై నుంచి వచ్చిన ఒక నెమలి ప్రమాదవశాత్తూ దట్టమైన ముళ్ల పొదల్లో చిక్కుకుపోయింది. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు దీనిని గమనించి వెంటనే సర్పంచ్ నిరుడి దాస్, ఉప సర్పంచ్ ఎంపీ సుధాకర్‌లకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి నెమలికి ఎటువంటి గాయాలు కాకుండా చాకచక్యంగా పొదల్లో నుంచి బయటకు తీశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాల సిబ్బంది నెమలికి ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైన ఇంజక్షన్ వేశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సెక్షన్ అధికారి అన్సార్, బీట్ ఆఫీసర్ వెంకటేశం తమ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. ఎంపీడీవో సత్యనారాయణ సమక్షంలో గ్రామస్తులు నెమలిని క్షేమంగా అటవీశాఖ అధికారులకు అప్పగించారు. జాతీయ పక్షి ప్రాణాలను కాపాడిన వేల్పుగొండ గ్రామస్తులను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏపీఓ పౌలు, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, జీపీఓ సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి చేతుల మీదుగా కృషి రత్న అవార్డు అందుకున్న డాక్టర్ శిఖామణి



ములుగు,నవంబర్20(ప్రజాజ్యోతి) ఉద్యానవన రంగంలో విశేష పరిశోధనలు,సాంకేతిక ఆవిష్కరణలు చేసి రైతులకు అందించిన సేవలకు గుర్తింపుగా ప్రముఖ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ డి శిఖామణి నీ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ప్రతిష్టాత్మక కృషి రత్న అవార్డుకు ఎంపిక చేసింది.ఈ అవార్డును శుక్రవారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,కమిషన్ సభ్యులు భవానిరెడ్డి,కేఎస్ రెడ్డి లు పాల్గొనగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ శిఖామణి కి కృషి రత్న అవార్డును అందజేశారు.ముఖ్యంగా ఉద్యాన రంగంలో ద్రాక్ష సాగు,ఉత్పత్తి నాణ్యత ప్రమాణాలు,ఎగుమతుల అభివృద్ధిలో విశేష కృషి చేశాడని, ఉప్పు చార లవణాలు కలిగిన నేలల్లో ద్రాక్ష సాగు విజయవంతంగా చేపట్టినందుకు డాగ్ రిడ్జ్ రూట్‌స్టాక్ గుర్తించడం ఆయన సాధించిన మరో ముఖ్యమైన విజయమని, యూరప్ మార్కెట్ కు ద్రాక్ష ఎగుమతులను ప్రోత్సహించే దిశగా నాణ్యత ప్రమాణాలు పురుగుమందుల అవశేషాలు పరిమితులకు అనుగుణంగా టేబుల్ గ్రేప్స్ ఉత్పత్తి సాంకేతికతను ప్రమాణీకరించారన్నారు.ద్రాక్ష పళ్ళు కోసిన అనంతరం నిల్వ ప్యాకింగ్ రవాణా పద్ధతులను అభివృద్ధి చేసి ద్రాక్ష పండ్ల తాజాదనాన్ని రవాణా నిలువ సమయంలో 45 రోజుల వరకు కాపాడే సాంకేతికతను రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడని, అంతేకాకుండా భారత్-బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా బ్రెజిల్ దేశంలోని ద్రాక్ష రైతులకు థామ్సన్ విత్తనములేని ద్రాక్ష సాగులో శిక్షణ అందించారన్నారు.ఐక్యరాజ్యసమితి ఆహార,వ్యవసాయ సంస్థ ప్రధాన సలహాదారుగా,నైజీరియా రైతులకు మామిడి,ద్రాక్ష,ఆయిల్ ఫామ్ సాగులో మార్గదర్శకత్వం వహించారని,ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ హార్టికల్చర్ సైన్స్ బెల్జియం కౌన్సిల్లో భారత ప్రతినిధిగా కూడా సేవలందించినట్లు ఆయన గుర్తు చేశారు.పూణే లో ఐసిఐఆర్ జాతీయ ద్రాక్ష పరిశోధన కేంద్రం స్థాపనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయ స్థాపన కీలక పాత్ర పోషించారు ద్రాక్ష సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తిని ప్రోత్సహించడం అంతర్జాతీయ స్థాయిలో భారత ఉద్యానవన రంగానికి గుర్తు తీసుకురావడంలో డాక్టర్ శిఖామణి అందించిన విశేష సేవలకు ఈ కృషి రత్న అవార్డు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది.

పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు

★ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం ★ సర్పంచ్ మద్దెల ★ వనజ స్వామి



దౌల్తాబాద్, నవంబర్ 20 (ప్రజాజ్యోతి) అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని గొడుగుపల్లి గ్రామ సర్పంచ్ మద్దెల వనజ స్వామి అన్నారు. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 27 చేయూత పింఛన్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌తో పాటు, 10 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను శుక్రవారం రోజున సర్పంచ్ మద్దెల వనజ స్వామి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. గొడుగుపల్లి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ నాయకుల సహకారంతో పాటు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ఆశీస్సులతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి గొడుగుపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. అలాగే త్వరలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించేందుకు కృషి చేసి, అర్హులైన నిరుపేదలకు అందిస్తామని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం పనిచేస్తూ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ మద్దెల వనజ స్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెలస్వామి, ఉప సర్పంచ్ దుర్గని దీపికా - మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం ,వార్డు సభ్యులు దుర్గని నరసింహులు, దుద్దెడ లక్ష్మి, మంత్రి కరుణాకర్, అంగన్వాడీ టీచర్స్ రేఖ, నాగరాజు ఎఫ్ఏ శ్రీనివాస్ నల్ల నరేష్ మలని రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభకు వెళ్లి మహిళ మృతి

★ నివాళులర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ★ తక్షణ సహాయంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కు అందజేత





సిద్దిపేట, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభకు వెళ్లిన ఓ మహిళ బస్సు కిందపడి మృతిచెందారు. హుస్నాబాద్ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కొమ్ము సారవ్వ సీఎం సభకు హాజరయ్యారు. బహిరంగ సభ ముగిసిన తర్వాత బస్సు కోసం వెళ్తుండగా ప్రమాదానికి గురై మరణించారు. ఆమె మృతిపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉన్న సారవ్వ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయంగా ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా, సారవ్వ మహిళా సంఘం సభ్యురాలు కావడంతో మహిళా సంఘం సభ్యులకు వర్తించే రూ.10 లక్షల ప్రమాద బీమా అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. వారి కుటుంబానికి అండగా నిలబడి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

అప్పా–మన్నేగూడ నాలుగు లైన్ల రహదారి పనులు వేగవంతం చేయాలి

నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలి: ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి

పరిగి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
అప్పా జంక్షన్–మన్నేగూడ జాతీయ రహదారి 163 నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్



టి.రామ్మోహన్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తన కృషితో వేగంగా కొనసాగుతున్న రహదారి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

టీఇయంజేయు (టెంజు) పరిగి నియోజకవర్గ అధ్యక్షులుగా పర్షమోని బాబు నియామకం

పరిగి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):
తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (టీఇయంజేయు) పరిగి నియోజకవర్గ అధ్యక్షులుగా పర్షమోని బాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ నాయకులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ వికారాబాద్ జిల్లా





అధ్యక్షులు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద్ చారి, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (టీఇయంజేయు) వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, జిల్లా యూనియన్ నాయకులు జావిద్, నాగరాజు, నియోజకవర్గ యూనియన్ నాయకులు జాక శ్రీశైలం, రఘు, ఇస్మాయిల్, జ్యోతిర్లింగం గౌడ్, దోమ మండల అధ్యక్షులు రాము ముదిరాజ్, ఉపాధ్యక్షులు బుచ్చి లింగం, ప్రధాన కార్యదర్శి సురేందర్, కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: మీర్ సమీనా తాహేర్ అలీ

పరిగి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో గల బీసీ కాలనీ, ఖాన్ కాలనీలలో శుక్రవారం పారిశుద్ధ్య పనులను



మున్సిపల్ కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇతర పారిశుద్ధ్య సమస్యలను మున్సిపల్ సిబ్బంది సహకారంతో పరిష్కరించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను రోడ్లపై, మురుగునీటి కాలువల్లో వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకే అందించాలని కోరారు. పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, మున్సిపల్ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన కుల్కచర్ల మండల పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీమిరెడ్డి

కుల్కచర్ల మండలం నవంబర్ 20 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో ఈరోజు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా మూడు గ్రామపంచాయతీలో ప్రారంభించడం జరిగింది ఇందులో భాగంగా వీరంపల్లి గ్రామంలో ఈరోజు ఉదయం పిఎసిఎస్ చైర్మన్ భీమిరెడ్డి ఏఎంసీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ ఎంపీడీవో రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు భీమ్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబ పెద్ద కోల్పోతే కుటుంబం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంటుందని అందువలన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ ఎంపీడీవో రామకృష్ణ నాయక్ జోగు వెంకటయ్య గౌడ్ మాజీ ఎంపిటిసి ఆనందం పిరంపల్లి గ్రామ సర్పంచ్ గడ్డం వెంకటయ్య ఉప సర్పంచ్ శాంత మొగులయ్య గ్రామ ప్రజలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది

ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం భరోసా

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
పాలమాకులలో ఇందిరమ్మ భరోసా పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
లబ్ధిదారులకు చేయూత పింఛన్ పట్టాలు అందజేత

రాజేంద్రనగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)
ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం భరోసా అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ భరోసా పథకాన్ని శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం





శంషాబాద్ మండలం పరిధిలోని పాలమాకుల గ్రామంలో గ్రామ సర్పంచ్ కటుకూరి కోటేశ్వర్ గౌడ్,శంషాబాద్ ఎంపీడీవో మున్ని, తహసిల్దార్ అమరలింగం గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు చేయూత పింఛన్ పట్టాలను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికే పెద్దపీట వేస్తోంది. ఇందిరమ్మ భరోసా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే మా లక్ష్యం అన్నారు. కుటుంబంలో యజమాని అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు ఈ బీమా పథకం ఉపయోగపడుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేస్తాం అని అన్నారు.గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. చేయూత పింఛన్లను పెంచి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఆసరా కల్పిస్తున్నాం. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక్క అర్హుడు కూడా మిగలకుండా అన్ని పథకాలను అందిస్తాం అని స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కట్కూరు కోటేశ్వర్ గౌడ్, లీలం మోహన్ నాయక్, రవీందర్ నాయక్, రవి నాయక్, ఉపసర్పంచ్ గూడెపు కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, నీరటి రాజు ముదిరాజ్, సత్యనారాయణ గౌడ్, ప్రభాకర్ యాదవ్, ప్రభు సాగర్, గుడాల కృష్ణ గౌడ్, ప్రసాద్ గౌడ్, మల్చలం లింగం, బాలు ముదిరాజ్, విద్యాల యాదగిరి,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ మండల సర్పంచులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాస్ వార్నింగ్

అధికారిక కార్యక్రమాలకు సర్పంచులు రాకపోతే చర్యలు తప్పవు
రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)
రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల సర్పంచులపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాలమాకులలో జరిగిన అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం చేపడుతున్న అధికారిక కార్యక్రమాలకు సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించడం, ఉద్దేశపూర్వకంగా గైర్హాజరు కావడం సహించేది లేదు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులుగా ప్రజా సమస్యలపై, ప్రభుత్వ పథకాలపై బాధ్యతగా వ్యవహరించాలి. ఇది రాజకీయాలకు సమయం కాదు, అభివృద్ధికి సమయం" అని ఆయన అన్నారు. కొంతమంది సర్పంచులు కావాలనే అధికారిక కార్యక్రమాలకు రావడం లేదనే సమాచారం నా దృష్టికి వచ్చింది. ఇకపై ఏ సర్పంచ్ అయినా అధికారిక కార్యక్రమాలకు గైర్హాజరైతే వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవు. నివేదికలు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు పంపుతాం. అభివృద్ధి నిధుల మంజూరులో కూడా వారి తీరును పరిగణనలోకి తీసుకుంటాం" అని హెచ్చరించారు.గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని, ఆ నిధులను సద్వినియోగం చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన



బాధ్యత సర్పంచులపై ఉందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరితో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, కానీ అభివృద్ధిని అడ్డుకుంటే మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ -లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ

కొత్తూరు నవంబర్ 20 (ప్రజా జ్యోతి)
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం



అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ అన్నారు. శుక్రవారం నందిగామ మండలంలోని సీడీ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గబ్రు చౌహాన్ మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్ నాయక్,సెక్రెటరీ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8 ఏళ్ల గోల్డెన్ రిట్రీవర్ కు అరుదైన శస్త్రచికిత్స.. 5.2 కిలోల భారీ కణితి తొలగింపు

రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల వైద్యుల ఘనత

రాజేంద్రనగర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)
రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని పీవీ నరసింహారావు పశువైద్య కళాశాలలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించబడింది. 8 సంవత్సరాల వయస్సు గల గోల్డెన్ రిట్రీవర్ జాతికి చెందిన కుక్కలో ఏర్పడిన సుమారు 5.2 కిలోల బరువున్న భారీ ప్లీహ గ్రంథి కణితిని పశువైద్య శస్త్రచికిత్స మరియు రేడియాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ జె.రాధాకృష్ణ రావు శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో పీజీ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థులు మరియు పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు సహాయకులుగా పాల్గొన్నారు. వైద్య బృందం సమన్వయం, నైపుణ్యం మరియు అంకితభావంతో అత్యంత క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.మాట్లాడలేని మూగజీవాల ప్రాణాలను కాపాడటమే వైద్య వృత్తికి నిజమైన సార్థకత అని, ఈ అరుదైన శస్త్రచికిత్స పశువైద్య రంగంలో రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల వైద్య బృందం యొక్క శస్త్రచికిత్సా నైపుణ్యాన్ని చాటిచెప్పిందని



కళాశాల వర్గాలు తెలిపాయి.

కార్తీక పౌర్ణమి సందర్భంగా మధు యాష్కి గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ఎల్బీనగర్ నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరుకావాలని అఖిల భారత ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధు యాష్కీ గౌడ్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎన్. లావణ్య ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు.



రోడ్డు ప్రమాదానికి గురైన వార్తా విలేకరి మంగలి నరసింహులును పరామర్శించి ఆర్థిక సాయం అందించిన డాక్టర్ చంద్రప్రియ

మోమిన్ పేట నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
మోమిన్‌పేట మండల పరిధిలోని వెల్ చాల్ గ్రామానికి చెందిన వార్తా విలేకరి మంగలి నరసింహులు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే ఈ విషయం తెలుసుకున్న



మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ చంద్రప్రియ శుక్రవారం వార్తా విలేకరి మంగలి నరసింహులు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం బాధిత విలేకరికి మన చంద్ర ఫౌండేషన్ తరపున ఆర్థిక సాయం అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని డాక్టర్ ఏ. చంద్రప్రియ తెలిపారు.ఈ సందర్భంగా మంగలి నరసింహులు డాక్టర్ ఏ. చంద్రప్రియకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవతా సేవలు అందిస్తున్న మన చంద్ర ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రెడ్డి బుచ్చిరాములు ఫౌండేషన్ సభ్యులు బుధారపు బుచ్చిరెడ్డి, రాజు, వెంకట్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

సమాజ ప్రయోజనాల కోసం ఐక్యంగా పోరాడుతాం

బషీరాబాద్ నవంబర్ 20 ప్రజా జ్యోతి:
గత కొన్ని రోజులుగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన రాజకీయ ప్రజాప్రతినిధులపై జరుగుతున్న అనుచిత వ్యాఖ్యలు, మాటల దాడులను తెలంగాణ ముదిరాజ్ యువజన కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ సందర్భంగా తాండూరు యువజన నియోజకవర్గ అధ్యక్షులు ఎస్.పి. రవికాంత్‌కు తమ సంపూర్ణ



మద్దతు, సంఘీభావం ప్రకటించింది. అదేవిధంగా తాండూరు మున్సిపల్ కౌన్సిలర్లు అల్లాపూర్ శ్రీకాంత్, బంటు వేణుగోపాల్‌కు కూడా పూర్తి మద్దతు తెలియజేసింది. వారు ఏ రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నది తమకు ముఖ్యం కాదని, ముదిరాజ్ సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులుగా వారు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో, సమాజ ప్రయోజనాల పరిరక్షణలో వారికి అండగా నిలుస్తామని కమిటీ నాయకులు స్పష్టం చేశారు. వారి నాయకత్వంపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు.ముదిరాజ్ సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులను అవమానించడం, బెదిరించడం లేదా లక్ష్యంగా చేసుకుని అనుచితంగా వ్యవహరించడం సహించేది లేదని, ఇలాంటి చర్యలు పునరావృతమైతే ఐక్యంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టపరమైన మార్గాల్లో గట్టిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు వేరైనా సామాజిక ఐక్యత ఒక్కటేనని, రాజకీయ అభిప్రాయాలు వేరైనా సమాజ ప్రయోజనాలు, ఆత్మగౌరవం విషయంలో ముదిరాజులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజ ప్రయోజనాలను, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని, ఎలాంటి పరిస్థితులనైనా సంఘటితంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నాయకులు పేర్కొన్నారు

మహిళా రైతుకు అండగా నిలిచిన మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చంద్రప్రియ

మోమిన్ పేట నవంబర్ 20 (ప్రజా జ్యోతి):
దుర్గం చెరువు గ్రామానికి చెందిన మహిళా రైతు కంకణి వెంకటమ్మ ఎంతో కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట పూర్తిగా దగ్ధమైంది. ఆరు నెలల



పాటు కష్టపడి పండించిన పంట కళ్లముందే బూడిద కావడంతో బాధిత మహిళా రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.
ఈ విషయం తెలుసుకున్న మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ శుక్రవారం దుర్గం చెరువు గ్రామానికి విచ్చేసి బాధిత మహిళా రైతును పరామర్శించారు. ఆమెకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. అలాగే నాయకులు మధుసూదన్ రెడ్డి కూడా తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏ. చంద్రప్రియ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామస్తులందరూ ఐకమత్యంతో, పరస్పర ప్రేమాభిమానాలతో కలిసిమెలిసి ఉండాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్తులకు సూచించారు. బాధిత రైతు కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, బుచ్చి రాములు, ఫౌండేషన్ సభ్యులు బుధరపు బుచ్చిరెడ్డి, రాజు, వెంకట్, దుర్గం చెరువు దుర్గం చెరువు సర్పంచ్ లావణ్య మోహన్. చంద్ర ప్రియ ఫౌండేషన్ మేడం దృష్టికి తీసుకుపోయిన ఐదో వార్డ్ మెంబర్ కిందికేరి పాండు గొల్ల శివకుమార్ గొల్ల సుధాకర్ సాయం ముల్ల ఇస్సాకు నన్ను సాబ్ మైబు మాజీ సర్పంచ్ మల్లేశం పటేల్ పాండయ్య గౌడ్ మురళి గౌడ్ గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు ఉన్నారు,

ఎండపల్లి మండలంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం

నాలుగు గ్రామ పంచాయతీల్లో వివరాల సేకరణ..

క్షేత్రస్థాయిలో పరిశీలించిన జెడ్పీ సీఈఓ, ప్రత్యేక అధికారి

ఎండపల్లి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి)
అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ ఎండపల్లి మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని కొండాపూర్, రాజారాంపల్లి, సూరారం, శానబండ గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల వివరాల సేకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి. గౌతమ్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ అధికారి



ఎం. రవిప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. నాలుగు గ్రామాల్లో జరుగుతున్న నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా పథకానికి దూరం కాకుండా సమగ్రంగా వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.<ఈ సందర్భంగా ఎంపీడీవో డి. కృపాకర్ మాట్లాడుతూ.. అర్హులైన కుటుంబాల సభ్యులు తమ వివరాల నమోదు, ధ్రువీకరణ కోసం సంబంధిత గ్రామ పంచాయతీల్లోని సిబ్బందిని సంప్రదించాలని ,ప్రభుత్వ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటిరోజు నాలుగు గ్రామాల్లో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య కొండాపూర్ లో 797 మొత్తం రేషన్ కార్డులకు గాను 115 ఆన్లైన్లో నమోదైనవి అలాగే రాజరాంపల్లి లో 604 కు గాను 120 నమోదు అలాగే సూరారం గ్రామంలో 168 కి గాను 72 నమోదు అలాగే శానబండ 102 కార్డులకు గాను 46 మొత్తం 1671 కార్డులకు గాను 353 నమోదైన వని అధికారులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఆర్ ఐ అన్వేష్, వివిధ శాఖల అధికారులు పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పిసిసి కార్యవర్గ సభ్యులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి,నాయకులు గ్రామస్తులు, పాల్గొన్నారు,

గొల్లపల్లి వేణుగోపాలస్వామి దేవాలయంలో చోరీ....

ఎల్లారెడ్డిపేట నవంబర్ 20(ప్రజా జ్యోతి)
ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో దొంగలు చొరబడినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. శుక్రవారం



ఉదయం భక్తులు స్వామివారి దర్శనం కోసం ఆలయానికి వెళ్లగా, ఆలయ గేటు మరియు తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు.వెంటనే భక్తులు గ్రామ సర్పంచ్ ★కొండ రమేష్ గౌడకు సమాచారం అందించడంతో, ఆయన హుటాహుటిన దేవాలయానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికులతో వివరాలు తెలుసుకుని, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బొప్పాపూర్ లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన .....



సర్పంచ్ గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 ప్రజా జ్యోతి
ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేద బడుగు బలహీన వర్గాల వారి కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని రాచర్ల బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు అర్హులైన పేదవారితో నమోదు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి వార్డు సభ్యులు గ్రామస్తులు కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు

పేద కుటుంబాలకు భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

ధర్మారం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి న్యూస్):
ధర్మారం మండలం కమ్మరిఖాన్ పేట గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ



కుటుంబ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు భరోసా, భద్రత కల్పించే గొప్ప పథకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి పథకం చేరేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి ఆలయాలు

- ఉన్నత స్థితికి ఎదగాలంటే పుస్తక పఠనం ఎంతో అవసరం
- విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి:

కరీంనగర్, నవంబర్ 20(ప్రజాజ్యోతి) గ్రంథాలయాలు విజ్ఞానానికి ఆలయాలని, జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే నిరంతర పుస్తక పఠనం ఎంతో అవసర మని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దారం శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, తెలంగాణ వ్యవస్థక అధ్యక్షుడు ముదిగంటి సుధాకర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. శశిజాదేవి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు మనిషి జీవితానికి దిశానిర్దేశం చేసే గొప్ప మార్గదర్శకాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా అజ్ఞానం తొలగిపోయి విజ్ఞానం పెంపొందు తుందని, విజ్ఞానవంతులు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని అన్నారు. దొంగలు



దోచుకోలేని సంపద విజ్ఞానమని, ఇతరులకు పంచిన కొద్దీ మరింత పెరిగేది జ్ఞానమని వివరించారు.
ప్రభుత్వ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రముఖులంతా ఏదో ఒక దశలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్న వారేనని తెలిపారు.టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు టీవీలు, సినిమాలతో విలువైన సమయాన్ని వృథా చేయకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను వినియోగించుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఒడ్యాడ్‌లో ఇందిరమ్మ భీమా పథకానికి శ్రీకారం

అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం – సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్

భీమారం: నవంబర్ 20(ప్రజాజ్యోతి) ఒడ్యాడ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా



పథకాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని, అందులో భాగంగా ఈ జీవిత భీమా పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందించేందుకు బస్టాండ్ సమీపంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి, రేషన్ కార్డు ఉన్న అర్హులైన కుటుంబ యజమానులు రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, పీఏసీఎస్ చైర్మన్ ఉరుమడ్ల లక్ష్మణ్, గ్రామ కార్యదర్శులు రమ్య, అశ్విని, స్వప్న, ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ సుమ, ఉపసర్పంచ్ మంతెన భారతి–రాజేందర్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వీవో ఆశ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు స్వామివారి నిజరూప దర్శనం పూర్వజన్మ సుకృతం

– శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

- ప్రజా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థించాం.

జగిత్యాల, నవంబర్ 20, ప్రజాజ్యోతి. కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేసే శక్తిని ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిజరూప దర్శన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆహ్వానం మేరకు కొండగట్టుకు వచ్చి స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 60 సంవత్సరాలకు ఒకసారి స్వామివారి విగ్రహానికి ఉన్న చందనాన్ని తొలగించే అరుదైన సందర్భంలో దర్శనం చేసుకునే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన మంత్రి, ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు, రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేసేందుకు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరింత శక్తిని, బలాన్ని ప్రసాదించాలని ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను తట్టుకునే శక్తిని ప్రసాదించా లని, తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషా లతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. అనంతరం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పలు ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. స్వామివారి నిజరూప దర్శనం చేసుకునే భాగ్యం కలగడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా నని, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేందుకు ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ అర్చకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు చేరిన ఎండు రొయ్యలు, వట్టి చేపల విక్రయాలు

పల్లిమక్తలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక విక్రయ స్టాల్

కోనరావుపేట, నవంబర్.20(ప్రజాజ్యోతి) < కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఈరోజు ఎండు రొయ్యలు, వట్టి చేపల విక్రయాలను చేపట్టారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి ఎండు రొయ్యలు, వట్టి చేపలను ప్రజలకు అందుబాటులో ఉంచి విక్రయించారు.ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎండు రొయ్యలు, చేపలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలని, వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయని వివరించారు. ప్రజలకు నాణ్యమైన చేపల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామంలో విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ విక్రయాలకు గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పలువురు ప్రజలు ఆసక్తిగా ఎండు రొయ్యలు, వట్టి చేపలను కొనుగోలు చేశారు. గ్రామస్థులకు నేరుగా అందుబాటులోకి వచ్చి విక్రయాలు చేపట్టడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిన్న రమేష్, ఎనగంటి నారాయణ, జిన్న అర్జున్,జిన్న సత్తయ్య,చిద్రవేణి ప్రభాకర్, రేగుల పరశురా ములు, జిన్న దుర్గయ్య, ఎనగంటి రాజేషం, తదితరులు పాల్గొన్నారు.



ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారమే రాజన్న ఆలయ అభివృద్ధి

శృంగేరి పీఠం సూచనలే మాకు మార్గదర్శకం

రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లతో ప్రణాళిక

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.
రాజన్న ఆలయ అభివృద్ధిపై వస్తున్న విమర్శలనుపై ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు పూర్తిగా ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగానే చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీ శ్రీ భారతీ తీర్థ స్వామి, శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామివారి సూచనలు, ఆదేశాల మేరకే అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు.వేములవాడ పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి పాల్గొన్న ఆది శ్రీనివాస్ అనంతరం రాజన్న ఆలయ అభివృద్ధిపై మాట్లాడారు.



ఆలయ అభివృద్ధి విషయంలో భక్తులు, పెద్దలు, సంబంధిత వర్గాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆలయ ప్రాచీనత, విశిష్టత, ప్రాశస్త్యానికి ఎలాంటి భంగం కలగకుండా పనులు చేపడుతున్నా మని పేర్కొన్నారు. సప్తమి నాడు పనులు జరిగితే అష్టమి నాడు చేపట్టినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, భక్తులు ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని కోరారు.గతంలో రాజన్న ఆలయ శిఖరం శిలామయంగా ఉండేదని, 1970 దశకంలో దానిని తొలగించి ఇటుకలతో నిర్మించినట్లు చర్చల్లో వెల్లడైందని తెలిపారు. శృంగేరి పీఠం సూచనల మేరకు ప్రస్తుతం తిరిగి శిఖరాన్ని శిలామయంగా నిర్మించే ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. శిఖరానికి సంబంధించిన కార్యక్రమాలు, కలశానికి ధాన్యవాసం, గర్భగుడిలో ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలన్నీ ఆగమ శాస్త్ర నియమాల ప్రకారమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు, ప్రభుత్వ యంత్రాంగం, ఆలయ అధికారులు, సలహాదారులు అందరూ ఆగమ శాస్త్ర మార్గదర్శకత్వంలోనే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధిపై ఎవరి వ్యక్తిగత నిర్ణయాలకు తావులేదని, శృంగేరి పీఠం సూచనలే తమకు మార్గదర్శకమని స్పష్టం చేశారు. విమర్శలకు విమర్శలతో సమాధానం చెప్పడం తమ ఉద్దేశం కాదని, భక్తులకు వాస్తవాలను వివరించడమే బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే నేరుగా అడిగి తెలుసుకోవాలని సూచించారు. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే పది మెట్లు దిగజారడానికి కూడా సిద్ధంగా ఉన్నామని, తమ లక్ష్యం ఆలయ అభివృద్ధి మాత్రమేనని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. సుమారు రూ.250 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు.

బీమా దరఖాస్తులో వివరాల నమోదు పక్కాగా ఉండాలి

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వివరాలు అందరికీ చేరవేయాలి
- జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా బీమా దరఖాస్తులో వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి... కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా వేములవాడ అర్బన్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23 వ వార్డు లో ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయగా, పరిశీ లించారు. రిజిస్టర్లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేయగా, పరిశీలించి.. ఎందరు నమోదు చేసుకున్నారో అడిగి తెలుసుకు న్నారు. అన్లైన్లో బీమా వివరాలు నమోదు చేస్తుండగా, పరిశీలించి.. మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేందుకు ఎంత సమయం పడుతుందో ఆరా తీశారు. సిరిసిల్లలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, అధికారులతో కలిసి ఆవిష్కరిం చారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు డిసెంబర్ 19వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఉన్నాయని వివరించారు. బీమా వివరాల నమోదు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. అర్హీదారులు రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. అన్ని ప్రత్యేక కేంద్రాల్లో బీమా వివరాలు, నామినీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, నోడల్ అధికారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల 23వ వార్డు సభ్యురాలు ఆడెపు చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు జయంత్, మహేష్ తదితరులు ఉన్నారు.



ఆనంతారం లో ఇందిరమ్మ బీమాపతకం ప్రారంభించిన

ఇల్లంతకుంట నవంబర్ 20(ప్రజాజ్యోతి)
కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో శుక్రవారం రోజు గ్రామపం చాయతీ కార్యాలయలొ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల అర్హులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించే ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామపంచాయతీ తరపున కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కదం జయంత్,పంచా యితీ కార్యదర్శి మారుతి,కంప్యూటర్ ఆపరేటర్ ఏల రాజు,వార్డు సభ్యులు మల్యాల రాజశేఖర్,బట్టి క్రాంతి,గోనపల్లి లావణ్య వెంకటేశం,మహిళా మండలి సిఏలు వొల్లాల స్వప్న,కదం జయ,అంగన్వాడి టీచర్లు,మంగవ్వ ఎంకవ్వ,ఆశా వర్కర్లు,పద్మ,తారవ్వ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఇందిరమ్మ జీవిత బీమాకు శ్రీకారం ఎమ్మెల్యే రాగమయి





సత్తుపల్లి నవంబర్ 20 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల అవసరాలను గుర్తిస్తూ,వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని,నిరుపేదలకు కుటుంబ యజమాని కోల్పోతే వారికి అండగా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి రూ.. 5 లక్షల రూపాయల ఉచిత బీమా ఇందిరమ్మ భీమా పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభిస్తున్నారు. అదేవిధంగా సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ జీవిత బీమా అనే అద్భుతమైన పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కుటుంబంలో యజమాని కోల్పోతే ఆదాయ మార్గాలు కోల్పోయి,వారి జీవన మార్గాలు రోడ్డున పడేవని, ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 18సంవత్సరాలు దాటి 59సంవత్సరాలు గలిగిన వారికి ప్రీమియం ప్రభుత్వమే భరిస్తూ ఏ విధంగా చనిపోయినా, రూ..5 లక్షల రూపాయలను నామినీకి వారి అకౌంట్ కి జమ చేస్తారని, ఈలాంటి బృహత్రమైన పథకం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందని అన్నారు.ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని,ఉ పయోగించుకోవాలని సూచించారు. ఆమె స్వయంగా కొందరివి ఆన్లైన్ చేసి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహా, చల్లగుల్ల కృష్ణయ్య, పింగళి సామేలు, వార్డ్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చల్లగుళ్లను అభినందించిన మువ్వా



సత్తుపల్లి నవంబర్20(ప్రజా జ్యోతి) ఇటీవల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన చల్ల గుళ్ల నరసింహారావును, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ మాజీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు శుక్రవారం మువ్వా వాటర్ ప్లాంట్ కార్యాలయంలో పూలమాలలో,శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా పదవి చేపట్టటం అభినందనీయమని, మంచి సర్వీస్ రైతులకు అందించాలని,ఆయన ప్రమాణ స్వీకారం చేయటంపై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెతుపల్లి గ్రామ సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు)కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి మరియు మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ భీమా కార్యక్రమాన్ని

ప్రారంభించిన ఎంపీడీఓ శారద, సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డి



ఎర్రుపాలెం ప్రజాజ్యోతి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ భీమా కార్యక్రమాన్ని తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం లో శుక్రవారం ఎంపీడీఓ శారద, గ్రామ సర్పంచ్ ముక్కర రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ముక్కర రామక్రిష్ణ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూరపాటి రమేష్,ఎంపీవో క్రిష్ణ, పీసీసీ సభ్యులు శీలం ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ అయిలూరి నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ముక్కర చిన్న లక్ష్మారెడ్డి, వార్డ్ నెంబర్ లు తలుపుల విజయ్ బాబు, కూరపాటి వరుణ్ కుమార్, ఐకేపీ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశ వర్కర్స్, పంచాయతీ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని మండలం నేరడ

గ్రామంలో భారీ పైథాన్ పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

• ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ గ్రామ ప్రజలు



చింతకాని నవంబర్ 20ప్రజాజ్యోతి :నేరడ గ్రామ రెవెన్యూ పరిధిలోని పత్తి చేనులో ఉన్న వన్యప్రాణి భారీ పైతాన్ కొండచిలువను గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ చూసిన మేరకు కాపాడిన,ఫారెస్ట్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి,కూలీలు, స్థానికులు ఒక రైతు పత్తి చేనులో ఈ రోజు పత్తి తీస్తున్న కూలీలకు భారీ పైతాన్ కొండచిలువ కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురై అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ ఘటన చింతకాని మండలం నేరడ గ్రామ రెవెన్యూ పరిధిలోని శ్రీ గంగమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది.పత్తి చేనులో పని చేస్తున్న కూలీలకు భారీ కొండచిలువ కనిపించడంతో వారు భయంతో చేను నుంచి బయటకు వచ్చి గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీకి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు.దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి స్థానికుల సహాయంతో చేనులో నక్కి ఉన్న భారీ పైతాన్ కొండచిలువ 70 కేజీల బరువున్న వన్యప్రాణిని పట్టుకున్నారు.కొండచిలువ ఇటీవల ఏదైనా జంతువును ఆహారంగా తీసుకుని ఉండవచ్చని, విశ్రాంతి కోసం చేనులోకి వచ్చి ఉండవచ్చని అటవీ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. భారీ కొండచిలువను అటవీ సిబ్బంది సురక్షితంగా పట్టుకోవడంతో కూలీలతో పాటు గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకెన నాగేశ్వరావు గ్రామ ఉప సర్పంచ్ కోట బాలేష్ చెవుల తిరుపతిరావు గ్రామపంచాయతీ సిబ్బంది కనకపూడి శంకర్రావు గుజ్జర్ల శంకర్రావు తదితరులు ఉన్నారు.

శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

• పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి): పట్టణంలోని శిల్పినగర్ ప్రాంతంలో శ్రీ కోదండ రామస్వామి దేవాలయ నూతన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దామోదర్, పట్టణ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు పాల్గొన్నారు. నూతన ఆలయ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తికావాలని, శ్రీ కోదండ రామస్వామి దివ్య ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు.

“ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా”తో పేదలకు ఎంతో లబ్ధి

• మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి

• ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు గ్రామం, ఏదులాపురం మున్సిపాలిటీ నాలుగో వార్డులో ప్రత్యేక శిబిరాల పరిశీలన







ఏదులాపురం మున్సిపాలిటీ/ ఖమ్మం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా’ పథకంతో పేదలకు చాలా మేలు జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీలోని 4వ వార్డులో స్థానిక కౌన్సిలర్ బోయిన కుమారి, ఆరెకోడు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, సర్పంచ్ ఆరెంపుల రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక శిబిరాలను సందర్శించారు. ఏదులాపురం 4వ వార్డులో మున్సిపల్ వైస్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి లతో కలిసి స్థానికుల వివరాలను పోర్టల్ లో ఆన్ లైన్ చేయించారు. ఆరెకోడు లో.. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో.. దయాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల వారికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి ప్రీమియం మన ప్రజా ప్రభుత్వమే భరిస్తుందని, నెల రోజులపాటు కొనసాగే నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో..: వార్డు కౌన్సిలర్లు బానోత్ నాగేంద్రప్రసాద్, దివ్య, బుర్రా మహేష్, ఆరెకోడు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గునిగంటి రమేష్, సీనియర్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సిలివేరు బాబు, పలువురు సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెల్లం శరత్‌కు న్యాయం చేయాలని కొవ్వొత్తుల నిరసన

• నేడు భద్రాచలం పట్టణ బంద్‌కు పిలుపు

• బంద్‌కు రాజకీయ పార్టీలు, అఖిలపక్ష సంఘాల సంపూర్ణ మద్దతు







భద్రాచలం, నవంబర్ 20, (ప్రజా జ్యోతి) : ఆదివాసీ యువకుడు తెల్లం శరత్ మృతి ఘటనకు నిరసనగా భద్రాచలం పట్టణంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. మృతుడు తెల్లం శరత్ చిత్రపటాన్ని చేతబూని, శ్రీ సత్యసాయి రెసిడెన్సీ ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శరత్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో న్యాయం కోసం నవంబర్ 21, శనివారం భద్రాచలం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, అఖిలపక్షాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివాసీ యువకుడి మృతికి న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. బంద్‌ను విజయవంతం చేయడానికి వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలంతా శాంతియుతంగా నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. శరత్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆపదలో ఉన్నవారికి

అండగా పైడి వెంకటేశ్వరరావు





దమ్మపేట, నవంబర్ 20(ప్రజాజ్యోతి): ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని గోపాలపురం సమీపంలో ఆటో బోల్తాపడిన ప్రమాదంలో అంకంపాలెం గ్రామానికి చెందిన ఊకే చెల్లమ్మ తీవ్రంగా గాయపడ్డారు. చేతికి, కాలికి గాయాలైనట్లు సమాచారం అందుకున్న ఆయన వెంటనే దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితురాలికి వైద్యం అందేలా దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో సత్తుపల్లికి తరలించే ఏర్పాట్లు చేశారు. సత్తుపల్లి ఆసుపత్రి యాజమాన్యానికి ఫోన్ చేసి బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాద సమయంలో స్పందించి బాధితురాలికి వైద్యసాయం అందేలా చొరవ చూపడంపై స్థానికులు అభినందించారు.


ఓ వ్యాపారి గిన్నెల దందా... ప్యాకేజీ దందా... భూ దందా...!

• మూడు దందాలు.. ఒకే సూత్రధారి..!

• ఒక చేత్తో గిన్నెలు.. మరో చేత్తో ప్యాకేజీలు.. కాళ్ల కింద వేల ఎకరాలు..!

• సర్వేలో 50 ఫేక్ పేర్లు.. బినామీలతో వేల ఎకరాలు..!

• ఏజెన్సీని తన గుప్పిట్లో పెట్టుకున్న ఓ గిన్నెల వ్యాపారి..!





గిన్నెల కొట్టుతో మొదలైన వ్యాపారం.. ఇప్పుడు ఏజెన్సీని గుప్పిట్లో పెట్టుకున్న మూడు దందాల సామ్రాజ్యంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పక్క గిన్నెల దందా.. మరో పక్క సింగరేణి ఓసీ సర్వేలో బినామీ పేర్లతో ప్యాకేజీల దందా.. ఇంకో పక్క ప్రభుత్వ.. అసైన్డ్.. ఫారెస్ట్ భూములను కబ్జా చేసిన భూ దందా.. ఈ మూడింటితో కోట్లు సంపాదించాడని తెలుస్తోంది. ఓసీ విస్తరణ సర్వేలో ఏకంగా 50 ఫేక్ పేర్లను నమోదు చేయించాడని ఆరోపణలు జోరుగా వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీలో గిరిజనేతరుడై ఉండి.. ఇన్ని వేల ఎకరాలు.. ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యాపారిపై వెంటనే విచారణ జరిపి.. కబ్జా చేసి బినామీల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 20, ప్రజాజ్యోతి... ఏజెన్సీ గడ్డపై పుట్టి పెరిగిన గిరిజనుడికి సెంటు భూమి దక్కడం లేదు.. కానీ అదే గడ్డపై బయటి నుంచి వచ్చిన ఓ గిన్నెల వ్యాపారి మాత్రం వేల ఎకరాలకు అధిపతి అయ్యాడు. గిన్నెల కొట్టు ముసుగులో మొదలైన దందా.. సింగరేణి ప్యాకేజీలు.. భూ కబ్జాల వరకు ఎలా విస్తరించిందో తెలిస్తే అధికారులే నోరెళ్లబెట్టాల్సిందే. బినామీల పేర్లతో సర్వేలో పేర్లు నమోదు చేయించి.. ప్రభుత్వ.. ఫారెస్ట్ భూములను తన గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై మణుగూరు అంతటా చర్చ నడుస్తోంది. ఈ దందా వెనుక ఎవరి అండ ఉందో.. కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తేల్చాలని గిరిజనులు నిలదీస్తున్నారు.

గిన్నెల దందా.. ప్యాకేజీ దందా.. భూ దందా..!

మణుగూరులో ఓ గిన్నెల వ్యాపారి చుట్టూ మూడు వేరు వేరు ఆరోపణలు తీవ్రంగా తిరుగుతున్నాయి. మొదటిది గిన్నెల విక్రయంలో అక్రమాలు జరిగాయన్న వాదన.. రెండవది సింగరేణి ఓసీ సర్వేలో బినామీల ద్వారా ప్యాకేజీలు పొందబోతున్నారన్న ఫిర్యాదు.. మూడవది ప్రభుత్వ, అసైన్డ్, అటవీ స్థలాలను ఆక్రమించారన్న అభియోగం సంచలనం రేపుతోంది. ఈ మూడింటిపై గిరిజన సంఘాలు స్వతంత్ర దర్యాప్తు కోరుతున్నాయి. సంబంధిత శాఖలు రికార్డులు పరిశీలించి నిజనిజాలు బయటపెట్టాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మూడు దందాలకు.. ఒకే సూత్రధారి..!

ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వేరు వేరు అక్రమాల వెనుక ఓ గిన్నెల వ్యాపారి హస్తం ఉందని అనుమానం వ్యక్తం అవుతోంది. గిన్నెల వ్యాపారం పేరుతో మొదలైన పరిచయాలు.. క్రమంగా సర్వే పనుల్లో జోక్యం వరకు వెళ్లాయని తెలుస్తోంది. ఆ తర్వాత భూముల కొనుగోళ్లు, ఆక్రమణల్లోనూ అదే పేరు వినిపిస్తోంది. అధికారులు ఈ వ్యాపారి చైన్ లింకును పరిశీలిస్తేనే వాస్తవం తెలుస్తుందని స్థానిక గిరిజన పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది బాధితులు తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఒక చేత్తో గిన్నెలు.. మరో చేత్తో ప్యాకేజీలు.. కాళ్ల కింద వేల ఎకరాలు..!

సాధారణ కొట్టుతో జీవనం ప్రారంభించిన వ్యాపారి కొద్ది కాలంలోనే భారీ ఆస్తులకు అధిపతి అయ్యాడన్నది మణుగూరులో చర్చనీయాంశంగా మారింది. సింగరేణి సర్వే సమయంలో తనకు సంబంధం లేని పేర్లను ప్యాకేజీ లిస్టులో చేర్పించారన్న ఆరోపణ బలంగా వినిపిస్తోంది. అదే సమయంలో చుట్టుపక్కల గ్రామాల్లో విస్తారంగా స్థలాలు తన అనుచరుల పేరిట కబ్జా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఆస్తుల మూలం ఏమిటో విచారించాలని.. ఆదాయ వనరుల లెక్క తేల్చాలని గిరిజనులు కోరుతున్నారు. నిజమైన ఓసీ సర్వే లబ్ధిదారులకు న్యాయం చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వేలో 50 ఫేక్ పేర్లు.. బినామీలతో వేల ఎకరాలు..!

సింగరేణి ఓసీ కోసం నిర్వహించిన సర్వేలో 50 నకిలీ పేర్లు ఈ వ్యాపారి హస్తంతో నమోదయ్యాయన్న ఫిర్యాదు ఇప్పుడు సంచలనంగా మారింది. నిజంగా అక్కడ నివాసం లేని వ్యక్తుల పేర్లు జాబితాలో చేరాయని కొందరు గని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. వారి వెనుక బినామీ వ్యవస్థ ఉందని.. ప్యాకేజీ సొమ్ము మరొకరి చేతికి వెళుతోందని తెలుస్తోంది. సర్వే రికార్డులు.. ఆధార్.. ఓటరు జాబితాలతో పోల్చి చూస్తే వాస్తవం బయటపడుతుందని వారు అంటున్నారు. తప్పుడు పేర్లను తొలగించి.. అర్హులకు మాత్రమే పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.


ఏజెన్సీని గుప్పిట్లో పెట్టుకున్న ఓ గిన్నెల వ్యాపారి..!

1/70 చట్టం అమలులో ఉన్న ఏజెన్సీలో.. గిరిజనేతరులకు భూమి బదిలీ నిషేధం ఉన్నా.. భారీగా స్థలాలు చేతులు మారాయన్న ఆరోపణ కలకలం రేపుతోంది. ప్రభుత్వ స్థలాలు.. గిరిజనులకు కేటాయించిన స్థలాలు.. అటవీ ప్రాంతాలు సైతం అన్యాక్రాంతమయ్యాయని ఫిర్యాదులు వస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయో విచారించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

ఎయిడ్స్ హెచ్ఐవి నియంత్రణలో వికారాబాద్‌కు జాతీయ గుర్తింపు

- 95-95-95 లక్ష్యాల సాధనతో 'సురక్షిత్' హోదా
డిసెంబర్ 1న ఢిల్లీలో సత్కారం

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 20(ప్రజా జ్యోతి): హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణలో వికారాబాద్ జిల్లా జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష' కార్యక్రమంలో భాగంగా, అంతర్జాతీయ 95-95-95



లక్ష్యాలను సాధించి 'సురక్షిత్ స్టేటస్'ను దక్కించుకుంది. ఈ ఘనతకు గుర్తింపుగా డిసెంబర్ 1న న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ వేడుకల్లో వికారాబాద్ జిల్లాను కేంద్ర ఆరోగ్య శాఖ సత్కరించనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, కు కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ రితు శర్మ అధికారిక ఆహ్వానం పంపించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులను కూడా ఆహ్వానించారు. హెచ్ఐవి తో జీవిస్తున్న వారికి మెరుగైన వైద్య సేవలు, వ్యాధిపై అవగాహన, నియంత్రణ చర్యలు, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, క్షేత్రస్థాయి కార్యకర్తల సమిష్టి కృషికి ఈ జాతీయ గుర్తింపు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయాన్ని హెచ్ఐవి ఎయిడ్స్ తో ప్రాణాలు కోల్పోయిన వారికి అంకితం చేస్తూ, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

ధారూర్ మెథడిస్ట్ జాతర ఆదాయం ఏమవుతోంది..?

- కోట్లలో కానుకలు భక్తులకు కనీస వసతులేవీ
- నిర్వాహకులను ప్రశ్నిస్తున్న భక్తులు

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 19(ప్రజా జ్యోతి):
వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ధారూర్ మెథడిస్ట్ జాతరకు ఏటా వేలాది మంది భక్తులు తరలివస్తూ మొక్కులు చెల్లించుకుని కానుకలు సమర్పిస్తున్నారు. ఈ కానుకల ద్వారా భారీ ఆదాయం సమకూరుతున్నప్పటికీ, జాతర





ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులకు సరైన తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడంలో లోపాలు కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతర ముగిసిన తర్వాత పేరుకుపోయిన చెత్తను తొలగించే భారం సైతం గ్రామపంచాయతీపైనే పడుతోందని చెబుతున్నారు. కానుకల లెక్కలేవీ..? భక్తులు సమర్పిస్తున్న కానుకల ద్వారా ఏటా ఎంత ఆదాయం వస్తోంది ఆ సొమ్మును ఎక్కడ, ఏ అవసరాలకు ఖర్చు చేస్తున్నారు? జాతర అభివృద్ధికి ఎంత కేటాయిస్తున్నారు? అనే వివరాలు బహిరంగంగా వెల్లడించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆదాయ, వ్యయాల లెక్కలను పారదర్శకంగా ప్రకటించడంతో పాటు ఆడిట్ నిర్వహించాలని కోరుతున్నారు. జవాబుదారీ ఎవరు..? జాతర నిర్వహణ బాధ్యత ఎవరిది? భక్తుల కానుకల వినియోగంపై పర్యవేక్షణ చేసేది ఎవరు? ఆదాయం సమకూరుతున్నప్పుడు కనీస సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ అంశాలపై సంబంధిత నిర్వాహకులు, అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. వందేళ్ల చరిత్ర కలిగిన జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. కానుకల ఆదాయానికి పూర్తి లెక్కలు ప్రకటించి, నిధులను జాతర అభివృద్ధికి వినియోగించాలి. భక్తుల విశ్వాసంతో సమర్పించిన ప్రతి రూపాయికి జవాబుదారీతనం ఉండాలి. జాతరకు వచ్చే ఆదాయం జాతర అభివృద్ధికి ఎప్పుడు ఉపయోగపడుతుంది అన్నదే భక్తుల ప్రధాన ప్రశ్న.

భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 20(ప్రజాజ్యోతి): బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 897.96 పాయింట్లు (1.08 శాతం) ఎగబాకి 83,919.71 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 286.30 పాయింట్లు (1.12 శాతం) పెరిగి కీలకమైన 25,800 మైలురాయిని అధిగమించి 25,800.60 వద్ద ముగిసింది. ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.47 శాతం లాభపడి మార్కెట్ ర్యాలీకి నాయకత్వం వహించింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.59 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 2.16 శాతం, యాక్సిస్ బ్యాంక్ 2.12 శాతం చొప్పున రాణించాయి. దీంతో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 3.01 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.49 శాతం లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కూడా సూచీల జోరుకు తోడయ్యాయి. మరోవైపు టైటాన్ (1.71 శాతం), టాటా స్టీల్ (1.69 శాతం), ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాలతో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) నిధుల ప్రవాహం, రూపాయి విలువ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం మార్కెట్లకు కలిసొచ్చాయి.

భూముల రీసర్వేలో ఆరు దశల విధానం

మొదటిపేజీ తరువాయి..

నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ గ్రామస్థాయి క్యాంపుల తర్వాత మూడు, నాలుగు రోజుల్లో కేసులను వేగంగా పరిష్కరించాలన్నారు. గ్రామ పెద్దలు, బాధిత రైతులు, పక్క భూముల పట్టాదారులతో చర్చించి వివాదాల పరిష్కారానికి ప్రయత్నించే విధంగా చేయాలని అన్నారు.ఉమ్మడి భూముల విభజనకు పరస్పర అంగీకారం, చట్టబద్ధత ఉంటేనే ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 9(2) నోటీసుల తర్వాత అప్పీల్ సమయంలో అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని సూచించారు. అప్పీళ్లు, అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే సెక్షన్ 13 కింద తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని సీసీఎల్ఏ ఆదేశించారు. గెజిట్ తర్వాతే భూ భారతి ఆర్వోఆర్(రికార్డ్స్ ఆఫ్ రైట్స్)



రికార్డుల సవరణ చేపట్టాలన్న లోకేశ్ కుమార్ హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు.

తేల్చుకుందాం రా..

మొదటిపేజీ తరువాయి..

పోల్చుకుంటూ, రేవంత్‌రెడ్డిని గన్నేరు చెట్టుతో పోల్చారు. కుట్రలు చేయడం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. ఆయన ప్రసంగంలో అబద్ధాలు, బూతులు తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క మాట కూడా లేదని మండిపడ్డారు. సిద్దిపేట సభకు ఇతర జిల్లాల నుంచి ప్రజలను తరలించారని.. ఈ విషయాన్ని సిద్దిపేట కమిషనరే తనతో చెప్పారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అంతకుముందు సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేశారు. 2029 ఎన్నికల్లో తెలంగాణలోనే కాకుండా సిద్దిపేట గడ్డపైనా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. ప్రజలు కోరుకున్న నాయకుడికే కాంగ్రెస్ టికెట్ ఇస్తామని.. ఆ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రజలదేనని అన్నారు. తెలంగాణ సాగునీటి హక్కులను సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. చంద్రబాబు జలదోపిడీకి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని.. రాష్ట్రం ఏర్పడిన 40 రోజుల్లోనే కృష్ణా జలాల పునఃపంపిణీ చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రభుత్వం సరైన వాదనలు వినిపించడం లేదని ఆరోపించారు. నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం అబద్ధమని హరీశ్‌రావు పేర్కొన్నారు. దేవాదుల వద్ద మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి నీటిని ఎందుకు ఎత్తిపోసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కిన వాటాను కూడా ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకోవడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలన బాగోలేదని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే బహిరంగంగా మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అందుకోవచ్చని సెటైర్లు వేశారు. కరువు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని.. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చూపించిందని హరీశ్‌రావు అన్నారు. పలువురు నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. తమపై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే

-జర్నలిస్టుల ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
-ఇళ్ళస్థలాల సాధనకై ధర్నా చేసిన జర్నలిస్టులు

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజా జ్యోతి):
జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం







అన్నారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల పోరాటానికి తన మద్దతు ఉంటుందని,ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ లో ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకై గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, పేద ప్రజల మాదిరిగా జర్నలిస్టులు కూడా పేదలేనని, వీరికి కూడా ప్రభుత్వం ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరారు. ధర్నా కు అధ్యక్షత వహించిన సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కోసం 18 ఏళ్ళుగా సొసైటీ పోరాడుతుందని, గత ప్రభుత్వాలు ఇళ్ళస్థలాలు ఇవ్వకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ళు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టు సంఘం పేరుతో కొందరు సోకాల్డ్ జర్నలిస్టు నాయకులు తమ సొసైటీ పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి చర్యలను సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షురాలు హేమ సుదర్శన్, జై స్వరాజ్ పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్ గౌడ, టీజేఎస్ అధికార ప్రతినిధి సలీమ్ పాషా, నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు ఆనంచిన్ని వెంకటేశ్వర రావు, ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్,సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, సీనియర్ మహిళా జర్నలిస్టు ప్రియా చౌదరి తదితరులు పాల్గొని ధర్నాకు మద్దతు తెలియజేస్తూ ప్రసంగించారు. ఇంకా ఈ ధర్నాలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కుంచం శ్రీనివాస్, వి. రవికుమార్, ఎం. రవికుమార్,సొసైటీ డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, వీరేశం, మహిళా జర్నలిస్టులు సీబీ లక్ష్మి, నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

మా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

మొదటిపేజీ తరువాయి..

ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమ కోసం బీజేపీ కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. నిలువునా దోపిడి చేశాయని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... "రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాతే తెలంగాణలో బీజేపీ ఏకంగా 8 ఎంపీ సీట్లను దక్కించుకుంది. అంతేకాదు, ఇటీవల ఎన్నికలు జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీజేపీ జెండా ఎగిరింది. త్వరలో జరగనున్న మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలు తమ ఖాతాలోకే చేరడం ఖాయం" అని కేంద్ర మంత్రి జోస్యం చెప్పారు. తెలంగాణ, కర్ణాటకతో పాటు హిమాచల్ ప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని, వారిపై ప్రజల్లో తీవ్ర అసహనం గూడుకట్టుకుందని పేర్కొన్నారు. ఆ పార్టీలను తెలంగాణ ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారని, రాబోయే రోజుల్లో వాటికి ఓటు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, తమ ఆకాంక్షల సాకారం మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కమలం వికాసం తథ్యమని కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ ప్రజల నాడి పట్టుకోవడంలో రాహుల్ గాంధీ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ నాయకులు సహా ఆయన దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ఒకే ఎజెండాతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. విపక్ష నేత కనీసం అవగాహన లేకుండా దేశంపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ సంస్థలను అంతర్జాతీయ వేదికలపై అవమానిస్తున్నారని తూర్పారబట్టారు. ఇది ప్రధాని మోదీని అవమానించడం కాదని.. దేశ ప్రజలను అవమానించడమనేని పేర్కొన్నారు.

తెలంగాణ కా బాద్షా కేసీఆర్

మొదటిపేజీ తరువాయి..

అన్నదేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించిన కేటీఆర్.. ముఖ్యమంత్రి పదే పదే 'తెలంగాణ రైజింగ్' అని చెబుతున్నారని, అసలు తెలంగాణ దేనిలో రైజింగ్ అవుతోంది.. క్రైమ్‌లోనా అని సూటిగా ప్రశ్నించారు. గత మూడేళ్లలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో చేసిన ఒక్క అభివృద్ధి పనిని అయినా చెప్పగలరా అని సవాల్ విసిరిన ఆయన, రాష్ట్రంలో ఎవరి వద్దకైనా వెళ్లి రేవంత్ రెడ్డి పేరు చెబితే తిట్లు మాత్రమే వినిపిస్తాయని అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలైన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిలే ముఖ్యమంత్రి అక్రమాలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తుచేశారు. అవినీతి ఆరోపణలు చేస్తూ.. దేశంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' కాదు, 'రేవంత్ రెడ్డి బ్యాంక్ ఆఫ్ ఇండియా' ఉందని అనాల్సిన పరిస్థితి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి బిల్డర్ దగ్గర ముఖ్యమంత్రి 10 శాతం వాటా తీసుకుంటున్నారని, అందుకే



దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ నుంచే నిధులు వెళ్తున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీకి 'ఏటీఎం'గా మారిన రేవంత్ రెడ్డి.. ఢిల్లీకి సంచులు పంపుతున్నారని, ఆ ఏటీఎం 2028 డిసెంబర్‌లో ఎక్స్‌పైర్ అవుతుందని పేర్కొన్నారు. రామ్‌లీలా మైదానంలో రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా ర్యాలీ చేస్తుంటే, ఇక్కడ పది మంది ఎమ్మెల్యేలను దొంగతనం చేసిన అసలైన 'ఓట్ చోర్' రేవంత్ రెడ్డి అని, ఆయన ఓట్లను కూడా దొంగతనం చేయగలరని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మా ముఖ్యమంత్రి అయినప్పటికీ, అంతకుమించి ఆయన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు బాడీగార్డుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇదే సమయంలో బీజేపీ నేతలపైనా కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిల్డర్ల నుంచి వసూళ్ల వ్యవహారం అంతా తెలిసి కూడా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రేవంత్ రెడ్డిని పట్టుకోరని, వారిద్దరి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీజేపీ మాత్రమే కలుపుకుంటూ వస్తోందని అన్నారు. ఇక రాష్ట్ర బీజేపీ నేతలు వాళ్ల హైకమాండ్‌కు గులాంగిరీ చేస్తారని, బండి సంజయ్ అమిత్ షా చెప్పులు మోస్తారని, రామచందర్ రావు అమిత్ షా కాళ్లు మొక్కుతారని, ఇదేం పద్ధతో తనకు ఎప్పటికీ అర్థం కాలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్థాయిని ప్రస్తావిస్తూ.. రేవంత్ రెడ్డికి తాము చాలని, కేసీఆర్ అవసరం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిది కేసీఆర్ స్థాయి కాదని, కేసీఆర్ స్థాయి వేరు, ఆయన స్థానం వేరని, ఒక కొడుకుగా కాకుండా ఒక సామాన్యుడిగా చెబుతున్నానని, కేసీఆర్ ఒక 'లివింగ్ లెజెండ్' అని కొనియాడారు. రేవంత్ రెడ్డి కేవలం 'పన్ టైమ్ వండర్ లీడర్' మాత్రమేనని, మూడేళ్లలో ఏం చేశారో చెప్పకుండా కేసులు పెడుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా బీఆర్ఎస్ పార్టీయే తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్.. "అమిత్ షా హో.. కోయి ఔర్ షా హో.. తెలంగాణ కా బాద్షా హై కేసీఆర్" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ దాడులు

కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవహారంలో సోదాలు

హైదరాబాద్, నవంబర్ 20(ప్రజాజ్యోతి):
తెలంగాణలో మరో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. రూ.40.96 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం ఉదయం ఖానాపూర్, హైదరాబాద్‌లో రేఖా నాయక్‌కు సంబంధించిన 2 ప్రాంతాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఆమె రైస్ మిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ధాన్యం, బియ్యం నిల్వలు, సరఫరా వివరాలతో పాటు కీలక రికార్డులను పరిశీలిస్తున్నారు. ఖానాపూర్ మండలం సత్తెనపల్లిలో రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ఉంది. ఈ మిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కేటాయించి.. మిల్లింగ్ అనంతరం నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించేలా ఒప్పందాలు చేసుకుంది. 2022-23, 2023-24, 2024-25 రబీ సీజన్లకు సంబంధించి ఈ ఒప్పందాలు జరిగాయి. అయితే ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా బియ్యాన్ని తిరిగి సరఫరా చేయలేదని పౌరసరఫరాల శాఖ ఆరోపించింది. మిల్లులో, గోదాముల్లో ఉండాల్సిన ధాన్యం, బియ్యం నిల్వలు లెక్కల్లో కనిపించలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. మొత్తం 9,639.962 టన్నుల ధాన్యం లెక్కల్లో తేలలేదని.. దీని విలువ కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకారం సుమారు రూ.40.96 కోట్లుగా అంచనా వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2022-23 సీజన్‌లో ఏఆర్ఎస్ మిల్లుకు 6,821.640 టన్నుల ధాన్యం కేటాయించారు. దీనికి బదులుగా 4,638.715 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. కేవలం 831.071 టన్నులే సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ సీజన్‌లో 5,482.96 టన్నుల ధాన్యం లెక్కల్లో తేలలేదని ఆరోపించారు. 2023-24 సీజన్‌లో 7,430.840 టన్నుల ధాన్యం అందించగా.. 5,052.971 టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. కానీ 3,205.269 టన్నుల బియ్యమే ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 2,717.209 టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. 2024-25 సీజన్‌లో 2,413.640 టన్నుల ధాన్యం కేటాయించగా.. 1,641.275 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే 343.200 టన్నుల బియ్యమే సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల సమయంలో మిల్లులో 469.117 టన్నుల ధాన్యం మాత్రమే ఉండగా.. బియ్యం నిల్వలు లేవని నివేదికలో పేర్కొన్నారు. గత ఆగస్టులో విజిలెన్స్ అధికారులు రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, బియ్యం సరఫరా వివరాలను పరిశీలించగా భారీ మొత్తంలో నిల్వలు లెక్కల్లో తేలలేదని గుర్తించారు. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని నమ్మకద్రోహం, మోసం సంబంధిత సెక్షన్లతో పాటు నిత్యావసర వస్తువుల చట్టంలోని సెక్షన్ 7 కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.



పౌరసరఫరాల శాఖ ఫిర్యాదు, పోలీసుల కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం ఖానాపూర్, హైదరాబాద్‌లో రేఖానాయక్‌కు సంబంధం ఉన్న రెండు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్ ఒప్పందాలు, బియ్యం సరఫరా, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మిల్లుకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టిందనే ఆరోపణల వెనుక ఆర్థిక లావాదేవీలు, నిధుల వినియోగం వంటి అంశాలపై ఈడీ ఆరా తీస్తోంది. సోదాల్లో లభించే పత్రాలు, ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది. అయితే రేఖానాయక్‌ను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967